RNI No: TGTEL/25/A2649

VOICE OF PRAJALU

# వాయిస్

ప్రజల గొంతుక - నిజం కోసం..

ఆఫ్ ప్రజలు



ప్రతి 12 కొత్త వాహనాల్లో

ఒకటి ఎలక్ట్రిక్

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMABAD ADILABAD

| హైదరాబాద్ | మంగళవారం, జూన్ 9, 2026 | తెలుగు దినపత్రిక | సంపుటి:1 | సంచిక : 51 | పేజీలు: 8 | వెల : రూ.1 |
|---|---|---|---|---|---|---|

## లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ....



చెన్నై, జూన్ 8, ( వాయిస్టుడే) : తమిళనాడు ఎన్నికల్లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. మరో కోలీవుడ్ స్టార్ పొలిటికల్ ఎంట్రీకి రంగం సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. రీసెంట్‌గా ఎన్నికల్లో టీవీకే పార్టీ ఘన విజయం సాధించి స్టార్ హీరో విజయ్ సీఎంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం తనదైన పాలన మార్క్‌తో దూసుకెళ్తున్నారు. ఆయన పార్టీలో ప్రముఖ కొరియోగ్రాఫర్, నటుడు, డైరెక్టర్ రాఘవ లారెన్స్ జాయిన్ అవుతున్నారంటూ రెండు రోజులుగా ప్రచారం సాగుతోంది. ఈ రూమర్స్‌కు లారెన్స్ చెక్ పెట్టారు. సోషల్ మీడియా వేదికగా కీలక ప్రకటన చేశారు. 'నేను తిరుచ్చి ఈస్ట్ ఉప ఎన్నికల్లో పోటీ చేస్తానని పలు మీడియా ప్లాట్ ఫామ్స్‌లో ప్రచారం జరుగుతోంది. నా మీడియా మిత్రులు కొందరు నాకు ఫోన్ చేసి దీనిపై వివరణ ఇవ్వాలని కోరుతూ నన్ను కలవాలని అభ్యర్థిస్తున్నారు. ఈ ఊహాగానాలు పెరిగిపోయి నేను దీనిపై స్పందించాల్సిన అవసరం ఉందని భావించినందున, ఈ విషయాన్ని మీతో పంచుకోవాలని అనుకుంటున్నా.నేను ప్రస్తుతం బెంజ్ సినిమా షూటింగ్‌లో ఉన్నాను. నా షెడ్యూల్ 10వ తేదీతో ముగుస్తుంది. మా అమ్మగారి ఆశీస్సులతో నా జీవితానికి సంబంధించి ఓ ముఖ్యమైన నిర్ణయం 11వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు అనౌన్స్ చేస్తాను.' అంటూ రాసుకొచ్చారు.ఏప్రిల్‌లో జరిగిన

(మిగతా 2వ పేజీలో)

## మియాపూర్‌లో రూ.1,674.74 కోట్ల అభివృద్ధి పనులకు

# సీఎం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

హైదరాబాద్, జూన్ 9 (వాయిస్ టుడే): మియాపూర్‌లో సైబరాబాద్ ప్రాంత అభివృద్ధికి ఊతమిచ్చేలా మొత్తం రూ.1,674.74 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. రహదారులు, ఫ్లైఓవర్లు, రైల్వే ఓవర్ బ్రిడ్జిలు, విద్యా సంస్థలు, మహిళా వసతి గృహాలు, మున్సిపల్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.161 కోట్ల వ్యయంతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జవీజ) ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే రూ.530 కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు, రూ.308 కోట్లతో శేరిలింగంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (=ాదీ) నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఇప్పటికే పూర్తయిన రూ.65.53 కోట్ల వ్యయంతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి దోహదపడేలా రూ.229 కోట్లతో ా==కు ఇరువైపులా సర్వీస్ రోడ్ల కోసం ప్రధాన వంతెన నిర్మాణం, కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. అదేవిధంగా రూ.110 కోట్లతో శంకర్‌పల్లి రోడ్‌లోని వీ+ు నుంచి మణికొండ వరకు పైప్‌లైన్ రోడ్డును అభివృద్ధి చేసే పనులకు, రూ.29.25 కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలోని రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జిల వరకు నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నగర రవాణా సౌకర్యాల మెరుగుదలకు రూ.26.50 కోట్లతో నానక్‌రామ్‌గూడ నుంచి గచ్చిబౌలి వరకు ా== ఎడమవైపు ప్రధాన క్యారేజ్‌వే విస్తరణ పనులకు కూడా శ్రీకారం చుట్టారు. విద్యా రంగానికి ప్రాధాన్యతనిస్తూ రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, ఉద్యోగినుల కోసం రూ.14.40 కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడ ప్రాంతాల్లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయిన తర్వాత సైబరాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గడంతో పాటు మౌలిక సదుపాయాలు మరింత మెరుగుపడనున్నాయని అధికారులు తెలిపారు.



## ఇథనాల్ ఆయిల్ వచ్చేసింది




హైదరాబాద్, జూన్ 8, ( వాయిస్ టుడే) భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇది ఇంధన రంగంలో కీలక మలుపు. కేంద్ర పెట్రోలియం మంత్రి హరదీప్ సింగ్ పురి ఢిల్లీలో ఈ-85 ఇంధనాన్ని అధికారికంగా లాంచ్ చేశారు. ఇందులో 80-85% ఇథనాల్, 14-19% పెట్రోల్ ఉంటాయి. ఢిల్లీలో దీని ధరూ.82.12గా నిర్ణయించారు. సాధారణ పెట్రోల్ ధరకన్నా రూ.20 తక్కువకే ఈ-85 ఇంధనం అందుబాటులోకి వచ్చింది.ఈ--20ను షెడ్యూల్ కంటే ముందే సాధించిన భారత్, ఇప్పుడు ఉన్నత స్థాయి ఇథనాల్ బ్లెండింగ్ దిశగా ధైర్యవంతమైన అడుగు వేసింది.ఈ--85 అనేది ఫ్లెక్స్ ఫ్యూయల్ వెహికిల్స్ కోసం ప్రత్యేకంగా తయారు చేసిన ఇంధనం. సాధారణ కార్లు, బైకులు దీన్ని ఉపయోగించలేవు. ఇంజన్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేసిన ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు మాత్రమే ఈ--85ను సమర్థవంతంగా ఉపయోగించగలవు. ప్రస్తుతం హీరో మోటోకార్ప్ (స్ప్లెండర్ ఫ్లెక్స్ ఫ్యూయల్, ఏఊ డీలక్స్), సుజుకి గిక్సర్ ఎస్ఎఫ్ 250 వంటి కొన్ని మోడల్స్ మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మారుతి సుజుకి వాగన్ఆర్ ఫ్లెక్స్ ఫ్యూయల్ వెర్షన్‌ను త్వరలో మార్కెట్‌లోకి తీసుకురావాలని యోచిస్తోంది.ఈ--85 ధర తగ్గడం వినియోగదారులకు తక్షణ ప్రయోజనం. కానీ నిజమైన లాభం దేశ స్థాయిలో ఉంది. ఈ-20 పాలసీ ద్వారా ఇప్పటికే రూ.1.84 లక్షల కోట్ల విదేశీ మారక నిల్వలు ఆదా అయ్యాయని

(మిగతా 2వ పేజీలో)

## లద్దాక్‌కు పోటెత్తున్న టూరిస్టులు



శ్రీనగర్ జూన్ 8, ( వాయిస్ టుడే) : వేసవిలో టూరిస్టు ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడుతున్నాయి. అయితే మన దేశంలో అందమైన కశ్మీర్‌లోని పహల్గాంలో గతేడాది జరిగిన ఘటనలో పర్యాటకులు కాస్త తగ్గారు. కానీ కేంద్రం, ఆర్మీ తీసుకున్న రక్షణ చర్యలతో ఈ వేసవిలో లద్దాక్‌కు పర్యాటకులు పోటెత్తుతున్నారు. ఈ మే నెలలో మొత్తం 72,834 మంది పర్యాటకులు లద్దాక్‌ను సందర్శించారు. గత ఏడాది మే నెలలో 32,927 మంది మాత్రమే వచ్చిన విషయాన్ని పోలిస్తే ఇది 121.2% అద్భుత పెరుగుదల. లద్దాక్ టూరిజం చరిత్రలో ఇది ఒక నిజమైన మైలురాయి. జనవరి నుంచి మే వరకు మొత్తం 1,17,546 మంది సందర్శకులు వచ్చారు. గతేఏడాది అదే కాలంతో పోలిస్తే 43.65% వృద్ధి. ఇందులో దేశీయ పర్యాటకుల సంఖ్య 1,10,585 (45.9% పెరుగుదల), విదేశీయులు 6,961 (15.5% పెరుగుదల). లద్దాక్ ఆర్థిక వ్యవస్థలో టూరిజం ఎంత కీలక పాత్ర పోషిస్తోందో

(మిగతా 2వ పేజీలో)

## 10 శాతం పెరగనున్న

# మద్యం ధరలు



హైదరాబాద్, జూన్ 8, (వాయిస్టుడే) : తెలంగాణలోని మందుబాబులకు నిజంగా ఇది చేదువార్తే. రాష్ట్రంలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉంది. ధరల సవరణపై ప్రభుత్వం తీవ్ర కసరత్తు చేస్తోంది. పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాల దృష్ట్యా మద్యం ధరలను కనీసం 10 శాతం పెంచాలని కంపెనీలు డిమాండ్ చేస్తుండగా.. ధరలు పెంచితే పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ నుంచి సరిహద్దుల ద్వారా అక్రమ మద్యం రవాణా పెరిగే ప్రమాదం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ సంప్రదింపులు జరుపుతోంది.తెలంగాణలో మద్యం ధరలు పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మద్యం ధరల సవరణపై అధ్యయనం చేయడానికి రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. సునీల్ కిషోర్ జైస్వాల్ అధ్యక్షతన ఏర్పాటైన త్రిసభ్య కమిటీ బుధవారం నుండి మూడు రోజుల సంప్రదింపుల ప్రక్రియను

(మిగతా 2వ పేజీలో)




# గ్రేటర్‌లో టీడీపీ పోటీ...

హైదరాబాద్, జూన్ 8, ( వాయిస్ టుడే) : ఎన్నికల్లో టిడిపి పోటీ చేసేందుకు సమాయత్తం అవుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా బీజేపీని ఉద్దేశించి టిడిపి అక్కడ యాక్టివ్ అయ్యేందుకు అన్ని సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం. తెలంగాణలో తెలుగుదేశం పార్టీలో పని చేసిన నేతలంతా ఇప్పుడు చంద్రబాబుకు టచ్ లోకి వస్తున్నట్లు సమాచారం. పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధంగా ఉన్నామని వారు తమ ప్రతిపాదనను చంద్రబాబు ఎదుట పెట్టినట్లు ప్రచారం సాగుతోంది. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలోనే తెలంగాణపై ఫుల్ ఫోకస్ పెట్టారట చంద్రబాబు. ప్రస్తుతం అక్కడ పార్టీకి నాయకత్వం లేదు కానీ.. క్యాడర్ ఇప్పటికీ కొనసాగుతోంది. టిడిపి అభిమానులు కూడా ఎక్కువే. గ్రేటర్ తో పాటు సెటిలర్స్ ఉన్న జిల్లాలు చాలా ఉన్నాయి. అటువంటి చోట్ల మాత్రం టిడిపి పేరు ప్రముఖంగా వినిపిస్తూనే ఉంటుంది.మొన్న తెలంగాణలో పర్యటనకు వచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దాదాపు పదివేల కోట్ల రూపాయల నిర్మాణాలకు సంబంధించి హైదరాబాదులో శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సీఎం చంద్రబాబు తో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇంటికి వెళ్లారు. చంద్రబాబుతో అయితే గంటల తరబడి చర్చించారు. అయితే దీని వెనుక భారీ వ్యూహం ఉన్నట్లు అప్పట్లోనే వార్తలు వచ్చాయి. ఏపీలో ఎన్డీఏ కూటమి నడుస్తోంది మూడు పార్టీలతో. తెలంగాణలో సైతం మూడు పార్టీలు ఏకతాటి పైకి వస్తే

(మిగతా 2వ పేజీలో)

## మరో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా

# బీసీ నేత




కరీంనగర్, జూన్ 8, ( వాయిస్ టుడే) : వచ్చే అసెంబ్లీ ఎన్నికలే టార్గెట్‌గా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై దృష్టి పెట్టింది బీఆర్ఎస్ అధిష్టానం. అందులో భాగంగా సభ్యత్వ నమోదును ప్రయారిటీలో తీసుకుని ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ స్థాయి ఇన్చార్జ్‌లను నియమించారు. ఆపని పూర్తవగానే.... గ్రామ, మండల, జిల్లా కమిటీలతో పాటు రాష్ట్ర కార్యవర్గాన్ని కూడా ఏర్పాటు చేయబోతున్నారు. ఈసారి ఆ కార్యవర్గమే సంచలనం అయ్యే అవకాశం ఉందని చెప్పుకుంటున్నాయి గులాబీ వర్గాలు. వెనుకబడిన తరగతులకు ప్రతినిధిగా పార్టీలో ఓ పెద్ద పోస్ట్ క్రియేట్ చేయాలనుకుంటున్నట్టు తెలుస్తోంది. ప్రస్తుతం పార్టీ అధ్యక్షుడిగా కేసీఆర్, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కేటీఆర్ ఉన్నారు. పార్టీ వ్యవహారాలన్నీ ఈ రెండు పదవుల చుట్టూనే తిరుగుతుంటాయని ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన పనిలేదు. అయితే... ఇక్కడే కొత్త ఆలోచన చేస్తోందట అధిష్టానం. కుటుంబ ముద్ర నుంచి బయటపడటంతో పాటు సామాజిక సమీకరణల్ని గట్టిగా పాటిస్తున్నామని చెప్పే క్రమంలో...కేటీఆర్‌కు సమాంతరంగా

(మిగతా 2వ పేజీలో)

వాయిస్ ఆఫ్ ప్రజలు
మంగళవారం, జూన్ 9, 2026

# నదీజలాల పంపిణీలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలపై పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీస్తాం: ఎంపీ వద్దిరాజు

కొత్తగూడెం, జూన్ 8 (వాయిస్‌టుడే): కృష్ణా, గోదావరి నదీజలాల పంపిణీలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను పార్లమెంటులో లేవనెత్తి కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న విద్యార్థులు, యువతకు ఉపయోగపడేలా బీఆర్ఎస్ నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి రూపొందించిన ఈ-క్లాస్ యాప్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన, సోమవారం కొత్తగూడెం క్లబ్ హాలులో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కృష్ణా, గోదావరి నదుల పరివాహక ప్రాంతం తెలంగాణలో ఎక్కువగా ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఆంధ్రప్రదేశ్ నీటిని అక్రమంగా తరలించుకుపోతున్నదని ఆయన ఆరోపించారు. గోదావరి-కావేరి అనుసంధానం జరిగితే అది తెలంగాణ భూభాగం నుంచే జరగాలని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు గతంలోనే స్పష్టం చేశారని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి నదీజలాల మళ్లింపుకు ప్రయత్నిస్తున్నారని, ఈ అంశంపై మాజీ మంత్రి టి. హరీష్ రావు ఇప్పటికే వివరించారని అన్నారు. కృష్ణా, గోదావరి జలాల పంపిణీలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను అరికట్టాలని పార్లమెంటులో దామోదర్ రావు, పార్థసారథి రెడ్డిలతో కలిసి ప్రస్తావిస్తామని, బీఆర్ఎస్ నాయకత్వంలో ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్తామని పేర్కొన్నారు. రాష్ట్రానికి నిధులు రాబట్టడంలో, తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడంలో కాంగ్రెస్, బీజేపీకి చెందిన లోక్‌సభ సభ్యులు విఫలమయ్యారని విమర్శించారు. యువతలో కేంద్ర ప్రభుత్వంపై అసంతృప్తి పెరుగుతోందని, ఇటీవల ఢిల్లీలో జరిగిన నిరసన కార్యక్రమాలు ఇందుకు నిదర్శనమని అన్నారు. కొత్తగూడెం రైల్వే స్టేషన్‌కు వందేళ్ల చరిత్ర ఉందని, దీనిని ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయడంతో పాటు భద్రాచలం మీదుగా బస్తర్, మల్కాన్‌గిరి వరకు రైల్వే మార్గాన్ని విస్తరించాలని కేంద్ర ప్రభుత్వానికి బీఆర్ఎస్ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. అలాగే ఖమ్మం-కొత్తగూడెం-పాల్వంచ-భద్రాచలం రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించి ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో అనుసంధానం చేయాల్సిన అవసరాన్ని కూడా పార్లమెంటులో



ప్రస్తావించినట్లు చెప్పారు. బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం త్వరలో ప్రారంభమవుతుందని, గ్రామ, మండల, జిల్లా కమిటీల ఏర్పాటు చేపడతామని తెలిపారు. యువతకు పార్టీలో మరిన్ని అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పార్టీని మరింత బలోపేతం చేయడం, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసిగిపోయారని, తిరిగి బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని పేర్కొన్న ఎంపీ రవిచంద్ర, అసెంబ్లీ స్థానాలు పెరిగినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని, కేసీఆర్ నాయకత్వమే రాష్ట్రానికి శ్రీరామరక్ష అని అన్నారు. రాకేష్ రెడ్డి రూపొందించిన ఈ-క్లాస్ యాప్‌ను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకుని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు దిండిగల రాజేందర్, మానే రామకృష్ణ, కాపు సీతామహాలక్ష్మి, వనమా రాఘవ, సింధూ తపస్వి, అనుదీప్, వేల్పుల దామోదర్, రాజు గౌడ్, మల్లెల రవిచంద్ర, సత్యనారాయణ నాయక్, బోయినపల్లి సుధాకర్ రావు, రాంబాబు, భండారి రుక్మేందర్, ప్రసాద్, దారా బాబు, వేణు తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి ఉత్సాహాన్ని తీసుకువచ్చారు.



## ప్రతి 12 కొత్త వాహనాల్లో ఒకటి ఎలక్ట్రిక్

హైదరాబాద్, జూన్ 8, ( వాయిస్ టుడే) : తెలంగాణలో 2025-26 ఫైనాన్షియల్ ఇయర్‌లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు భారీగా పెరిగాయి. ఈ ఏడాది రిజిస్టర్ అయిన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాల్లో 91,637 ఎలక్ట్రిక్ వాహనాలే (8.6 శాతం). అంటే ప్రతి 12 వాహనాల్లో ఒకటి ఈవీ కావడం విశేషం. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనే సగానికి పైగా వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఈవీ రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రూ. 769.81 కోట్ల జీవితకాల పన్ను మినహాయింపులను అందించడం ఈ వృద్ధికి కీలక దోహదకారిగా నిలిచిందని నిపుణులు చెబుతున్నారు.తెలంగాణలో పర్యావరణ అనుకూల రవాణా వ్యవస్థ దిశగా అడుగులు శరవేగంగా పడుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2025-26) లో రాష్ట్రవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల కొనుగోళ్లు, రిజిస్ట్రేషన్లు సరికొత్త రికార్డులను సృష్టించాయి. ఈ కాలంలో మొత్తం 91,637 ఎలక్ట్రిక్ వాహనాలు రవాణా శాఖ వద్ద నమోదయ్యాయి. ఈ ఏడాది రాష్ట్రంలో నమోదైన మొత్తం 10.62 లక్షల కొత్త వాహనాలలో ఇవి ఏకంగా 8.6 శాతం వాటాను దక్కించుకోవడం విశేషం. ఈ గణాంకాలను పరిశీలిస్తే.. తెలంగాణలో రిజిస్టర్ అయిన ప్రతి 12 కొత్త వాహనాలలో ఒకటి ఖచ్చితంగా ఎలక్ట్రిక్ వాహనమేనని స్పష్టమవుతోంది.రాష్ట్రంలో వాహనాల కొనుగోలు సామర్థ్యం, సొంత వాహనాల వాడకం విపరీతంగా పెరుగుతున్న తరుణంలోనే ఈ ఈవీ విప్లవం కూడా ఊపందుకుంది. 2025-26 లో తెలంగాణ రోడ్లపైకి రికార్డు స్థాయిలో 10.62 లక్షల నూతన వాహనాలు వచ్చాయి. అంటే సగటున ప్రతిరోజూ దాదాపు 2900 కొత్త వాహనాలు రాష్ట్ర రవాణా నెట్‌వర్క్‌లో భాగమవుతున్నాయి. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణ, ప్రజల తలసరి ఆదాయం, వ్యయ సామర్థ్యం పెరగడం, విస్తరిస్తున్న పారిశ్రామిక కార్యకలాపాలు, ముఖ్యంగా హైదరాబాద్ మహానగర పరిసరాల్లో వ్యక్తిగత ప్రయాణ సాధనాలకు పెరిగిన డిమాండ్ ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.గ్రేటర్ హైదరాబాద్, దాని పరిసర ఐటీ కారిడార్ పరిధిలోని జిల్లాలే ఎప్పటిలాగే వాహన రిజిస్ట్రేషన్లలో సింహభాగాన్ని ఆక్రమించాయి. హైదరాబాద్ జిల్లాలో 1,97,539 కొత్త వాహనాలతో మొదటి స్థానంలో నిలిచింది. రంగారెడ్డి జిల్లాలో 1,87,044 రిజిస్ట్రేషన్లతో తర్వాతి స్థానాన్ని దక్కించుకుంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 1,75,630 నూతన వాహనాలతో మూడో స్థానంలో నిలించింది. ఈ మూడు జిల్లాల పరిధిలోనే రాష్ట్రంలోని మొత్తం కొత్త వాహన రిజిస్ట్రేషన్లలో సగానికి పైగా అంటే 50 శాతానికి పైనే నమోదు కావడం గమనార్హం. రాష్ట్రంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని మరింత ప్రోత్సహించడానికి, కొనుగోలుదారులపై ఆర్థిక భారాన్ని తగ్గించడానికి తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీలు, పన్ను మినహాయింపులను సమర్థవంతంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఈవీ కొనుగోలుదారులకు ఏకంగా రూ. 769.81 కోట్ల విలువైన లైఫ్‌టైమ్ టాక్స్ మినహాయింపులను ప్రభుత్వం పొడిగించింది. ఈ భారీ ప్రోత్సాహకాలు ఈవీల ప్రారంభ కొనుగోలు వ్యయాన్ని తగ్గించి, పెట్రోల్-డీజిల్ వాహనాల నుండి బ్యాటరీ వాహనాల వైపు వేగంగా మారడానికి పౌరులను ప్రేరేపిస్తున్నాయని నిపుణులు అంటున్నారు.


# గ్రేటర్‌లో టీడీపీ పోటీ...

బాగుంటుంది అనే అభిప్రాయం ఉంది. అయితే గతంలో మాదిరిగా ప్రత్యేక రాష్ట్ర భావన లేదు. ఇప్పుడు అంతా అభివృద్ధి అజెండాగా సాగుతోంది తెలంగాణ రాజకీయం. తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేసేందుకు ఇదే సరైన సమయం అని చంద్రబాబు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర పెద్దల ఆదేశాలతో గ్రేటర్ ఎన్నికల్లో మూడు పార్టీల మధ్య పొత్తు ఉండబోతుందనేది ఒక అంచనాతెలుగుదేశం పార్టీకి తెలంగాణలో బలమైన కేడర్ ఉంది. ఎందుకంటే ఆ పార్టీ పుట్టింది తెలంగాణలో. ఎన్టీఆర్ బలమైన పునాదులు ఏర్పాటు చేశారు. అవి తెలంగాణలో ఎక్కువగా నాటుకున్నాయి కూడా. మధ్యలో ప్రత్యేక రాష్ట్రం వాదంతో తెలుగుదేశం కాస్త ఇబ్బంది పడింది. ప్రతి దానికి చంద్రబాబు బూచి ని చూపించి రాజకీయం చేశారు. ప్రత్యేక రాష్ట్రం సిద్ధించి పుష్కరకాలం దాటుతున్న క్రమంలో క్రమేపి ప్రాంతీయ వాదం బలహీనపడుతోంది. అభివృద్ధి మంత్రం పతాక స్థాయికి చేరుకుంటుంది. అందుకే ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలు కలిసి నడుస్తాయన్న ప్రచారం జరుగుతోంది.తెలంగాణలో ప్రస్తుతం అన్ని పార్టీల్లో ఉన్న నాయకులు ఎక్కువగా టిడిపి నుంచి వెళ్లిన వారి. గులాబీ పార్టీలో అయితే ఆ పార్టీ బాస్ కెసిఆర్ నుంచి దిగువ స్థాయి కేడర్ వరకు అంతా టిడిపి దే. కాంగ్రెస్ పార్టీలో కూడా మెజారిటీ నాయకత్వం టిడిపి నుంచి వెళ్ళింది. అయితే ఇప్పుడు గులాబీ పార్టీ పరిస్థితి బాగా లేకపోవడంతో.. ఆ పార్టీలో ఉన్న పూర్వపు టిడిపి నేతలు అంతా పూర్వాశ్రమం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారట. తెలంగాణలో తెలుగుదేశం పార్టీని యాక్టివ్ చేస్తే చేరేందుకు సిద్ధమవుతున్నారట. ఇప్పటికే చంద్రబాబుకు చాలామంది టచ్లోకి వచ్చారట. సరైన సమయం చూసి చెబుతానని బాబు చెప్పారట. చూడాలి మరి ఈ ప్రచారంలో నిజం ఎంత ఉందో

## మరో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బీసీ నేత

మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్‌ని సృష్టించాలనుకుంటున్నట్టు సమాచారం. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగే సెప్టెంబర్, అక్టోబర్‌లోనే ఈ కొత్త వర్కింగ్ ప్రెసిడెంట్ నియామకాన్ని కూడా చేపట్టాలనుకుంటున్నట్టు తెలుస్తోంది.ఆ పోస్ట్‌లో ఒక బీసీ నేతను నియమించాలనుకుంటున్నారన్నది బీఆర్ఎస్ ఇంటర్నల్ టాక్. కొత్తగా మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయని అంటున్నారు పార్టీ నేతలు. ప్రస్తుతం దేశంతో పాటు రాష్ట్రంలో కూడా బీసీ ఉద్యమం వాయిస్ పెరుగుతోంది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు అన్యాయం చేసిందని బీఆర్ఎస్ పదేపదే చెబుతోంది. ఈ సమయంలో బీసీలకు న్యాయం చేసేది తామేనని చెప్పుకునే క్రమంలో కేటీఆర్ స్థాయికి సమానంగా ఉండే మరో వర్కింగ్ ప్రెసిడెంట్ పోస్ట్ సృష్టించి దాన్ని బీసీ నేతలు ఇవ్వాలని భావిస్తున్నారట. అలా.... బీసీ నేతకు పార్టీలో కేటీఆర్‌తో సమాన స్థాయి ఇవ్వడం ద్వారా బలహీనవర్గాలకు ప్రాధాన్యం, కుటుంబ ముద్ర చెరిపేసుకోవడం లాంటి బహుళ లక్ష్యాలను సాధించాలనుకుంటున్నట్టు సమాచారం. ఆ కొత్త పదవికి ఎవర్ని ఎంపిక చేయాలనే దానిపై కూడా కేసీఆర్ కసరత్తు చేస్తున్నట్టు చెబుతున్నారు. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్లకు, హైదరాబాద్ మహబూబ్ నగర్ రంగారెడ్డి జిల్లాల పట్టభద్రుల స్థానానికి త్వరలో ఎన్నికలు రాబోతున్నాయి. కాబట్టి ఆ జిల్లాలకు సంబంధించిన నేతను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటిస్తారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ముందు వరసలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉన్నట్టుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి.ప్రస్తుతం తలసాని గ్రేటర్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఈ మూడు కార్పొరేషన్ల పరిధిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలోనే సమావేశాలు జరుగుతున్నాయి. వచ్చే గ్రేటర్ ఎన్నికలు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఆయనకే వర్కింగ్ ప్రెసిడెంట్ ఇస్తారన్న అంచనాలు ఎక్కువగానే ఉన్నాయి. మరోవైపు తలసానితో పాటు మరికొంత మంది బీసీ నేతల పేర్లు కూడా వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి రేస్‌లో వినిపిస్తున్నాయి. మహబూబ్ నగర్ జిల్లా నుంచి మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేరు కూడా పరిశీలనలో ఉందట. ఉత్తర తెలంగాణలో కీలక నేతగా ఉన్న మరో మాజీ మంత్రి గంగుల కమలాకర్ పేరు కూడా బీసీ కోటాలో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పరిశీలనలో ఉన్నట్టు తెలుస్తోంది. అలాగే... పార్టీలో సీనియర్ నేత అయిన మండలి ప్రతిపక్ష నాయకుడు మధుసూదనా చారి, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయట. దీంతో... ఫైనల్‌గా కొత్త పదవి ఎవర్ని వరిస్తుందోనని ఆసక్తిగా చూస్తున్నాయి గులాబీ వర్గాలు.


# అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్



## డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో అత్యాధునిక సౌకర్యాలతో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఈ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం రూ.110 కోట్లు కేటాయించగా, అందులో తొలి విడతగా రూ.50 కోట్లు విడుదల చేసినట్లు వెల్లడించారు. సోమవారం అంబేద్కర్ భవన్‌ను రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలాతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో నిర్మించనున్న ఈ నాలెడ్జ్ సెంటర్ నిరుపేద విద్యార్థులకు ఉన్నత స్థాయి శిక్షణ అందించే కేంద్రంగా రూపుదిద్దుకుంటుందని భట్టి తెలిపారు. ఇందులో శిక్షణ తరగతులు, ఆధునిక డిజిటల్ లైబ్రరీ, వివిధ దేశాల నుంచి వచ్చే ప్రతినిధులతో సెమినార్లు, చర్చా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని పంచుతామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలోనూ అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణకు ఈ కేంద్రాలు దోహదపడతాయని అన్నారు. అదే విధంగా, నింబోలి అడ్డలోని ఎస్సీ హాస్టల్‌ను ఆధునికీకరిస్తున్నామని, దానికి "బాబు జగ్జీవన్ రామ్ భవన్"గా నామకరణం చేయనున్నట్లు డిప్యూటీ సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# లారెన్స్ పొలిటికల్ ఎంట్రీ....



తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నుంచి విజయ్ పోటీ చేసి రెండు స్థానాల్లోనూ విజయం సాధించారు. పెరంబూర్ నుంచి ఎమ్మెల్యేగా కొనసాగాలని నిర్ణయించుకుని తిరుచ్చి ఈస్ట్ వదులుకున్నారు. దీంతో ఇక్కడ త్వరలోనే బై ఎలక్షన్ జరగనుంది.ఈ స్థానంలో లారెన్స్ టీవీకే తరపు నుంచి పోటీ చేస్తారని కొన్ని రోజులుగా ప్రచారం సాగుతోంది. దీనిపైనే ఈ నెల 11న ఆయన క్లారిటీ ఇవ్వనున్నారు. మరి ఆయన విజయ్ పార్టీలో చేరి పోటీలో నిలుస్తారా మరేదైనా ప్రకటన చేస్తారా? అనేది ఆసక్తిగా మారిందిలారెన్స్ కేవలం నటనలోనే కాకుండా సామాజిక సేవలోనూ ఎప్పుడూ ముందుంటారు. తన తల్లి పేరు మీద అనాథలకు, వృద్ధులకు చేతనైన సాయం అందిస్తారు. అలాగే, మీడియాలో వచ్చిన కథనాలపైనా స్పందిస్తూ అవసరమైన వారికి తనకు తోచిన సాయం చేస్తుంటారు. ఆయన పొలిటికల్ ఎంట్రీ కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఇథనాల్ ఆయిల్ వచ్చేసింది



మంత్రి పురి తెలిపారు. ఈ-85 విస్తరణతో ఈ సేవింగ్స్ ఇంకా భారీగా పెరిగే అవకాశం ఉంది. ఇథనాల్ దేశీయంగా ఉత్పత్తి అవుతుంది కాబట్టి క్రూడ్ ఆయిల్ దిగుమతులు తగ్గుతాయి, డాలర్ ఖర్చు తగ్గుతుంది. రైతులకు అదనపు ఆదాయం (పంచదార, మొక్కజొన్న, 2ఎ ఇథనాల్ ద్వారా వ్యవసాయ వ్యర్థాలు) వస్తుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపిరి లభిస్తుంది.ఈ--85 సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే 50--60% తక్కువ కార్బన్ ఎమిషన్లను విడుదల చేస్తుంది. వాయు కాలుష్యం తగ్గడం, ఆరోగ్య సమస్యలు తగ్గడం దీర్ఘకాలిక లాభాలు. వరల్డ్ ఎన్విరాన్‌మెంట్ డే రోజే ఈ -- 85ను లాంచ్ చేయడం యాదృచ్ఛికం కాదు. ఇది సవాలుతో కూడిన మార్గం. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాలు ఇంకా చాలా తక్కువప్రస్తుతం ఢిల్లీ--ఎన్‌సీఆర్, ముంబై, పూణే, నాగ్‌పూర్‌లో మాత్రమే 50 పెట్రోల్ బంకుల్లో అందుబాటులో ఉంది. 2026 చివరి నాటికి 500 స్టేషన్లు, 2027 నాటికి 5,000 స్టేషన్లు అన్నది లక్ష్యం.ఇంజన్ పనితీరు, మైలేజ్, శీతాకాలంలో కోల్డ్ స్టార్ట్ సమస్యలు కూడా పరిశీలించాల్సి ఉంది.ఈ--85 లాంచ్ భారత్‌ను ఇంధన దిగుమతి భారం నుంచి విముక్తి కగిలిస్తుంది. ఇది రైతు, పర్యావరణం, ఆర్థిక స్వావలంబన, శక్తి భద్రత నాలుగు లక్ష్యాలను ఏకకాలంలో సాధించే అవకాశం ఇస్తోంది. ఇది విజయవంతం కావాలంటే కేవలం లాంచ్ చేయడం సరిపోదు. ఫ్లెక్స్ ఫ్యూయల్ వాహనాల ఉత్పత్తిని వేగవంతం చేయడం, ఇథనాల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడం, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను త్వరగా విస్తరించడం, వినియోగదారుల్లో అవగాహన కల్పించడం ఇవన్నీ ఒకేసారి జరగాలి.

## లద్దాక్‌కు పోటెత్తున్న టూరిస్టులు

స్పష్టంగా చెప్పే సంకేతాలు.లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఈ వృద్ధిని సమర్థించడమే కాకుండా, టూరిజం రంగానికి స్థానికులకు ఉపాధి కల్పించే ముఖ్యమైన ఇంజిన్‌గా అభివర్ణించారు. ఆయన నాయకత్వంలో గత కొన్ని నెలల్లో తీసుకున్న కీలక నిర్ణయాలు ఈ పెరుగుదలకు దోహదపడ్డాయి. హోటల్స్, హోమ్‌స్టేలు, టూర్ ఆపరేటర్ల కోసం ఏకీకృత, సరళీకృత రిజిస్ట్రేషన్ విధానం, టూరిజం యూనిట్లకు "ఇండస్ట్రీ" స్టేటస్ ఇవ్వడం కాంప్లయన్స్ భారం తగ్గించి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రోత్సహించాయిఈ సంస్కరణలు స్థానిక యువతకు మరిన్ని అవకాశాలు కల్పించాయి. హోమ్‌స్టేలు, ట్రాన్స్‌పోర్ట్, హ్యాండిక్రాఫ్ట్, ఫుడ్ అండ్ బెవరేజెస్ రంగాల్లో ఉపాధి పెరిగింది. మెరుగైన రోడ్డు కనెక్టివిటీ, ఎక్కువ విమాన సర్వీసులు, సోషల్ మీడియా ద్వారా లద్దాక్ సౌందర్యం వైరల్ కావడం, పోస్ట్--పాండమిక్ ట్రావెల్ బూమ్ ఈ సీజన్‌ను రికార్డు స్థాయికి తీసుకెళ్లాయి. ప్రత్యేకించి మే నెలలో రోడ్లు తెరవడం, అనుకూల వాతావరణం, పర్వతాలు, సరస్సులు, మఠాలు, అడ్వెంచర్ యాత్రలు కలిపి ఒక అద్భుతమైన అనుభవాన్ని అందిస్తున్నాయి. ఈ అపూర్వ వృద్ధి ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ, లద్దాక్ పర్యావరణ సున్నితత్వాన్ని మరచిపోకూడదు. ఇప్పటికే పాపులర్ స్పాట్లైన పాంగాంగ్ లేక్, నుబ్రా వ్యాలీ, లే--మనాలి హైవేల్లో క్రౌడింగ్, వాస్ట్ మేనేజ్‌మెంట్, నీటి కొరత, వాహనాల నుంచి వచ్చే కాలుష్యం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. లద్దాక్ ఒక ఫ్రాజైల్ ఎకోసిస్టమ్. ఇక్కడ టూరిజం వృద్ధి చెందాలంటే అది సస్టైనబుల్, రెస్పాన్సిబుల్ టూరిజంగా మాత్రమే ఉండాలి. ప్రభుత్వం, స్థానికులు, టూరిజం స్టేక్‌హోల్డర్లు కలిసి పనిచేసి, క్యాపాసిటీ బిల్డింగ్, ఆఫ్--సీజన్ టూరిజం ప్రోత్సాహం, ఎకో--టూరిజం, వేస్ట్ మేనేజ్‌మెంట్, కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గించడం వంటి వ్యూహాలను అమలు చేయాలి.లద్దాక్ టూరిజం ప్రస్తుతం చూస్తున్న ఈ బూమ్ ఒక అపూర్వ అవకాశం. సరైన ప్రణాళిక, స్థానికుల పాల్గొన్నత, పర్యావరణ సంరక్షణతో కూడిన విధానాలతో ఈ వృద్ధిని మరింత స్థిరంగా, అర్థవంతంగా మార్చుకోవాలి. లద్దాక్ కేవలం ఒక టూరిస్ట్ డెస్టినేషన్ కాదు.. ఇది ఒక ప్రత్యేకమైన జీవన విధానం, సంస్కృతి, ప్రకృతి. దానిని కాపాడుకుంటూ అభివృద్ధి చేయడమే నిజమైన విజయం.

# 10 శాతం పెరగనున్న మద్యం ధరలు

ప్రారంభించింది. ఈ కమిటీలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సునీల్ శర్మ, చార్టర్డ్ అకౌంటెంట్ నవీన్ రెడ్డి సభ్యులుగా ఉన్నారు. మద్యం కొనుగోలు ధరల పెంపు నిర్ణయం ఇప్పుడు ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు పెద్ద సవాల్‌గా మారింది. ఒకవైపు మద్యం కంపెనీల నుంచి వస్తున్న ధరల పెంపు ఒత్తిడి, మరోవైపు ధరలు పెంచితే పొరుగు రాష్ట్రం నుండి ముంచుకొచ్చే అక్రమ మద్యం స్మగ్లింగ్ ముప్పు.. ఈ రెండింటి మధ్య సమతుల్యతను సాధించేందుకు ప్రభుత్వం తీవ్రంగా శ్రమిస్తోంది. విచారణలో మద్యం తయారీ కంపెనీల ప్రతినిధులు కమిటీ ముందు హాజరై తమ నివేదికలను సమర్పించారు. మద్యం తయారీకి అవసరమయ్యే ముడిసరుకులు, ప్యాకేజింగ్ మెటీరియల్స్, రవాణా ఛార్జీలు విపరీతంగా పెరిగిపోయాయని వారు కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల దృష్ట్యా తమకు లాభసాటిగా ఉండాలంటే కనీసం 10 శాతం మేర కొనుగోలు ధరలను పెంచాలని వారు అభ్యర్థించారు. అయితే మద్యం కంపెనీల డిమాండ్ సమంజసంగానే ఉన్నప్పటికీ ధరలను భారీగా పెంచితే అది రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయానికి గండికొట్టే ప్రమాదం ఉందని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌తో తెలంగాణ సుదీర్ఘమైన అంతరాష్ట్ర సరిహద్దును పంచుకుంటోంది. తెలంగాణలో మద్యం ధరలు గనుక విపరీతంగా పెరిగితే.. రెండు రాష్ట్రాల మధ్య రేట్ల వ్యత్యాసం భారీగా పెరుగుతుందని అంటున్నారు.తెలంగాణలో కొనుగోలు ధరలు పెరిగితే.. అది అంతిమంగా రీటైల్ ధరలపై ప్రభావం చూపుతుంది. అదే సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో గనుక రీటైల్ ధరలు తక్కువగా ఉంటే సరిహద్దు జిల్లాలైన ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, గద్వాల వంటి ప్రాంతాల ప్రజలు ఆంధ్రప్రదేశ్ నుంచి మద్యం కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల తెలంగాణకు రావాల్సిన పన్నుల రూపంలోని భారీ ఎక్సైజ్ రాబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని అధికారులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో.. అటు కంపెనీల ప్రయోజనాలను కాపాడుతూనే ఇటు సరిహద్దు ముప్పును అరికట్టేలా జస్టిస్ సునీల్ కిషోర్ కమిటీ ఎలాంటి సిఫార్సులు చేయబోతుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# కుర్మీ సమాజంలోని అన్ని వర్గాలు ఏకమైతే మహారాష్ట్రలో కొత్త శక్తి ఏర్పడుతుంది : ఎల్. పి. పటేల్

## శివరాజ్యాభిషేక దినోత్సవం సందర్భంగా "కుర్మీ జోడో అభియాన్" ఘనంగా ప్రారంభం

కర్జత్ (రాయగడ్), జూన్ 8 : అఖిల భారతీయ కుర్మీ క్షత్రియ మహాసభ ఆధ్వర్యంలో శివరాజ్యాభిషేక దినోత్సవం సందర్భంగా రాయగడ్ జిల్లాలోని కర్జత్ తాలూకా కిర్వలి గ్రామంలో నిర్వహించిన "కుర్మీ జోడో అభియాన్" ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహాసభ జాతీయ సంరక్షకుడు, మాజీ జాతీయ అధ్యక్షుడు ఎల్. పి. పటేల్ మాట్లాడుతూ, కున్బీ, మరాఠా, పటేల్, పాటీదార్, కన్బీ, కులంబీ, కాపు తదితర దేశవ్యాప్తంగా కుర్మీ గుర్తింపుతో ఉన్న సమాజాలన్నీ ఒక వేదికపైకి వస్తే, మహారాష్ట్రలో బలమైన సామాజిక మరియు సంస్థాగత శక్తి ఏర్పడుతుందని అన్నారు.

సమాజ ఐక్యత, విద్య, సంఘటిత శక్తి మరియు సామాజిక చైతన్యమే భవిష్యత్తులో అతిపెద్ద బలమని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్యంతోనే మహాసభ "కుర్మీ జోడో అభియాన్" ప్రారంభించిందని, దీని ద్వారా సమాజంలోని వివిధ వర్గాలను ఒకే తాటిపైకి తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొన్న మధ్యప్రదేశ్ మాజీ మంత్రి రామ్‌ఖిలావన్ పటేల్ మాట్లాడుతూ, ఛత్రపతి శివాజీ మహారాజ్ మహారాష్ట్రకే కాకుండా దేశమంతటికీ స్ఫూర్తి ప్రదాత అని అన్నారు. ఆయన ఆదర్శాలు మరియు దేశ నిర్మాణ భావనను అనుసరించి సమాజం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

హర్యానాకు చెందిన ధనుష్యధారి వీర్ మరాఠా ట్రస్ట్ అధ్యక్షుడు సురేంద్ర సింగ్ భోస్లే మాట్లాడుతూ, పానిపట్ యుద్ధం అనంతరం హర్యానాలో స్థిరపడిన కున్బీ-మరాఠా సమాజం తమ సాంస్కృతిక సంప్రదాయాలను, వారసత్వాన్ని నేటికీ కాపాడుకుంటున్నట్లు వివరించారు.

కిర్వలిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ స్మారక స్థూపం వరకు నిర్వహించిన భారీ శోభాయాత్రతో కార్యక్రమం ప్రారంభమైంది. అనంతరం ప్రముఖులు శివాజీ మహారాజ్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి నివాళులు అర్పించారు. ప్రధాన కార్యక్రమం సాయికృపా శెల్కే బంధు సభాగృహంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన షాహిరీ పోవాడా ప్రదర్శన ప్రేక్షకుల్లో ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా స్వర్గీయ బాబూలాల్ సింగ్ స్మారకార్థం సమాజ ఐక్యత మరియు సామాజిక సేవలో విశేష కృషి చేసిన పలువురు ప్రముఖులను స్మారక చిహ్నాలతో సత్కరించారు.

కార్యక్రమంలో శివాజీ మహారాజ్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. కేశరీలాల్ వర్మా, గుజరాత్ మాజీ జిల్లా కలెక్టర్ సి. జె. పటేల్, ఐఏఎస్ అకాడమీకి చెందిన వజ్ర పటేల్, తెలంగాణ కాపు సమాజ సంస్థ జాతీయ అధ్యక్షుడు కొండ దేవయ్య,వాయిస్ టుడే ఎండీ కోత్త లక్ష్మణ్ పటేల్, రవి చందే, ప్రొ. జయపాల్ పాటిల్, ప్రొ. బి. ఎల్. పాటిల్, మహాసభ మహారాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ పాటిల్, రాష్ట్ర సంరక్షకుడు అడ్వొకేట్ గోపాల్ శెల్కే, ప్రధాన కార్యదర్శి జయేష్ షేలార్ పాటిల్, శంకర్ థోర్వే, సమీర్ పాటిల్, ప్రమోద్ థోంబే పాటిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే థానే, పాల్ఘర్, రాయగడ్ జిల్లాల వివిధ సామాజిక సంస్థల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో దివంగత సామాజిక సేవకుడు వి. జి. పాటిల్ కు ప్రకటించిన మరణానంతర "కుర్మీ భూషణ్ అవార్డు"ను ఆయన భార్య వందనా పాటిల్ మరియు కుమార్తె డా. నూతన్ మోకాశి స్వీకరించారు. అదనంగా, దివ్యాంగుడైనా అనేక కోటలు, గఢ్‌లను విజయవంతంగా సందర్శించిన జనార్ధన్ పానమంద్, పరిశ్రమ మరియు సామాజిక రంగాల్లో విశేష కృషి చేసిన గజానన్ జాధవ్, సహకార మరియు సామాజిక రంగాల్లో సేవలందిస్తున్న సదానంద్ సురోషే, బ్యాంకింగ్ రంగంలో ప్రతిభ కనబరిచిన సీతారామ్ పాటిల్, కళారంగానికి సేవలందించిన నిలేశ్ పాటిల్లను ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సంజయ్ పాటిల్ ప్రవేశిక ప్రసంగం చేశారు. కార్యక్రమాన్ని జయేష్ షేలార్ పాటిల్ నిర్వహించగా, చివరగా రామదాస్ ఘరత్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం విజయవంతం కావడానికి ప్రభాకర్ శెల్కే, రామదాస్ ఘరత్, దిలీప్ తామ్హాణే విశేషంగా కృషి చేశారు. "కుర్మీ జోడో అభియాన్" ప్రారంభం సమాజంలో ఐక్యత, సంఘటిత శక్తి మరియు సామాజిక సమన్వయానికి కొత్త సందేశాన్ని అందించడంతో పాటు, పాల్గొన్న వారిలో ఉత్సాహాన్ని నింపింది.

## విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు తొలగించిన విద్యుత్ అధికారులు



నాగారం, జూన్ 8:-(వాయిస్ టుడే): కాప్రా డివిజన్ మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి చొరవతో గాంధీనగర్లో విద్యుత్ తీగలు, జనావాసాలపై ప్రమాదభరితంగా వ్రేలాడుతున్న చెట్ల కొమ్మలను సోమవారం తొలగించడం జరిగింది. సమస్య తెలిపిన వెంటనే స్పందించి సిబ్బందిని పంపించిన మాజీ కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి, సమస్యను పరిష్కరించుటకు కృషి చేసిన కాంగ్రెస్ నాయకులు గాంధీనగర్ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జి సత్యనారాయణకి ధన్యవాదములు తెలిపిన గాంధీనగర్ వాసులు బాలమణి, మల్లమ్మ, నర్సింగ్ రావ్, జయమ్మ, సత్యనారాయణ, గణేష్, ధన్ రాజ్ పాల్గొన్నారు.

## టీఎస్ ఆర్టీసీలో ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

### నిందితుడిని అరెస్టు చేసిన నాచారం పోలీసు



నాచారం (వాయిస్ టుడే): టీఎస్ ఆర్టీసీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిరుద్యోగ యువతకు మాయమాటలు చెప్పి మోసం చేసిన ఘరానా మోసగాన్ని నాచారం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొమ్రం భీం ఆసీఫాబాద్ జిల్లాకు చెందిన వడ్లూరి రాజశేఖర్ (37) గతంలో రణవీర్ మ్యాన్ పవర్ సర్వీస్ ఇంచార్జిగా పని చేసేవాడు. అయితే రాజశేఖర్ మరో ఇద్దరు గుండ్లపల్లి ప్రవీణ్ కుమర్, నరేష్లతో కలిసి నాచారంలో ఒక కార్యాలయాన్ని ఏర్పాటు చేశాడు. టీఎస్ ఆర్టీసీలో అధికారులతో తనకు మంచి సంబందాలు ఉన్నాయని. తన పరపతిని ఉపయోగించి ఆర్టీసీలో డ్రైవర్, కండక్టర్ ఉద్యోగాలను ఇప్పిస్తానని ఒక్కొరొక్కరి వద్ద రూ.50 వేల నుంచి లక్ష రూపాయాల వరకు వసూలు చేశాడు. అయితే డబ్బులు వసూలు చేసి ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో వడ్లకొండ వినయ్ అనే బాధితుడు నాచారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. దాంతో కేసు నమోదు చేసిన పోలీసులు ధర్యాప్తు చేపట్టారు. పోలీసులు చేపట్టిన ప్రాధమిక ధర్యాప్తులో 48 మంది బాధితుల నుంచి సుమారు రూ.21 లక్ష 35 వేల నగదును బాధిత కుటుంబ సభ్యుల అకౌంట్ల నుంచి రాజశేఖర్ బ్యాంకు ఖాతాకు బదిలీ అయినట్లు పోలీసుల విచారణలతో తేలడంతో వడ్లూరి రాజశేఖర్ను పోలీసులు అరెస్టు చేయగా, మిగతా ఇద్దరు నిందితులు గుండ్లపల్లి ప్రవీణ్ కుమర్, నరేష్ పరారిలో ఉన్నారని పోలీసులు తెలిపారు.



## ఎల్పీజీ వాణిజ్య మరియు గృహ వినియోగ సిలిండర్ల పట్టివేత

### విశ్వసనీయ సమాచారం మేరకు, దాడి చేసి పట్టుకున్న అధికారులు

నాగారం, జూన్ 8:-(వాయిస్ టుడే): మెడ్చల్ జిల్లా, కీసర మండలం లోని కరీమ్‌గూడ, రాంపల్లి గ్రామీణ ప్రాంతాలలోని రెండు ప్రదేశాలలో టీమ్-5 8వ తేదీ సోమవారం దాడులు నిర్వహించింది. ఈ దాడులలో వాణిజ్య మరియు గృహ వినియోగ సిలిండర్లను అక్రమంగా నిల్వ చేసినట్లు కనుగొన్నారు. వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:- 1) కరీమ్‌గూడ (గ్రామీణ)లో, ఇంటి నెం. 16-2-49కి ఆనుకుని ఉన్న బహిరంగ ప్రదేశంలో, ఈ క్రింది వివరాల ప్రకారం వాణిజ్య మరియు గృహ వినియోగ సిలిండర్లు కనుగొన్నారు. ఒక్కొక్కటి 19.5 కేజీల బరువు గల మొత్తం వాణిజ్య సిలిండర్లు - 53 (14 నిండుగా , 39 ఖాళీగా). గృహ వినియోగ సిలిండర్లు - 4 (ఖాళీగా). 5 కేజీల బరువు గల చిన్న సిలిండర్లు 4. విశ్వనాథ్ తండ్రి అయిన టి. రాకేష్ అనే వ్యక్తి ఈ వ్యవహరిస్తున్నాడని వెల్లడైంది. 16-2-49 కరీంగూడ గ్రామం, కీసర మండలం నివాసి గృహ మరియు వాణిజ్య సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తున్నాడు. 2) కీసర మండలం లోని రాంపల్లి గ్రామంలో, ఇంటి నెం.7-1-44 యొక్క ఖాళీ స్థలంలో మరియు ఒక ఆటో (జీటో)లో మొత్తం 23 వాణిజ్య సిలిండర్లు క్రింది వివరాల ప్రకారం కనుగొన్నట్లు తెలిపారు. రాంపల్లి గ్రామంలోని ఇంటి నెం. 7-1-44 పక్కన ఉన్న ఖాళీ స్థలంలో 15 వాణిజ్య సిలిండర్లు కనుగొన్నారు. ఆటో నెం.టిఎస్-08-యుడి- 8297 వద్ద 8 వాణిజ్య సిలిండర్లు కనుగొన్నారు. పైన పేర్కొన్న ప్రదేశంలో మొత్తం 23 వాణిజ్య సిలిండర్లు (4 నిండువి మరియు 19 ఖాళీవి) కనుగొన్నారు. ఇంటి నెం.16-2-49 కరీంగూడ గ్రామం నివాసి అయిన ఎనుగు జంగారెడ్డి, తండ్రి పేరు బాల్ రెడ్డి, ఈ అక్రమ వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడైంది. 7-1-44, రాంపల్లిలో వాణిజ్య సిలిండర్లను అక్రమంగా విక్రయిస్తున్నారు. రెండు చోట్ల వాణిజ్య, గృహ, చిన్న 5 కేజీల రకాలకు చెందిన మొత్తం 84 సిలిండర్లు లభ్యమయ్యాయి. బృందం వెంటనే సంబంధిత మెడ్చల్ జిల్లా డిటి(సిఎస్)ని సంఘటనా స్థలానికి పిలిపించింది. పంచనామా నిర్వహించడం, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడం, అలాగే అన్ని సిలిండర్లను భద్రంగా ఉంచడం కోసం గ్యాస్ ఏజెన్సీకి తరలించడం వంటి తదుపరి చర్యల కోసం సిలిండర్లను స్వాధీనం చేసుకుని డిటికి అప్పగించడం జరిగింది. పరిశీలన కోసం పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఎస్పీ రమేష్, ఇటిఎఫ్, టీమ్-5. సభ్యులు పాల్గొన్నారు.

## హరితపురి, విజయపురి కాలనీల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

### ప్రజావాణిలో వినతిపత్రం



నాగారం, జూన్ 8:-(వాయిస్ టుడే): ప్రజావాణి కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ కి నాగారం మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్ర రెడ్డి సోమవారం వినతి పత్రం అందజేసారు. నాగారం గ్రామంలోని హరితా పురి కాలనీ మరియు విజయపురి కాలనీల మధ్య ప్రవహిస్తున్న కాలువపై సరైన వంతెన లేకపోవడం వల్ల నాగారం మరియు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కమిషనర్ తెలియజేయడం జరిగింది. 2020 సంవత్సరంలో, ప్రజల సౌకర్యార్థం నాగారం మున్సిపల్ కౌన్సిల్ కాలువపై ఒక వంతెనను నిర్మించింది. అయితే, భారీ వర్షాలు మరియు వరదల కారణంగా ఆ వంతెన కూలిపోయి అప్పటి నుండి ఉపయోగం లేకుండా మారింది. ఈ మార్గం నాగారం, దమ్మాయిగూడ మరియు అనేక ఇతర పరిసర కాలనీల నివాసితులకు ఒక ప్రధాన కనెక్టివిటీ మార్గంగా ఉంది. వేలాది మంది ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు మరియు వృద్ధులు తమ దైనందిన రవాణా అవసరాల కోసం ఈ మార్గంపైనే ఆధారపడి ఉన్నారు. వంతెన లేకపోవడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడంతో పాటు తీవ్రమైన భద్రతా సమస్యలు తలెత్తుతున్నాయి. అందువల్ల, భారీ వర్షాలు మరియు వరద పరిస్థితులను తట్టుకోగల శాశ్వతమైన మరియు పటిష్టమైన వంతెనను నిర్మించడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్ గారికి తెలియజేయడం జరిగింది. అంతేకాకుండా, అన్నారాయచెరువు (నాగారం) నుండి చెర్లపల్లి చెరువు వరకు నాలా వెంబడి రక్షణ గోడలు (రెయినింగ్ వాల్స్) నిర్మించాలని, ప్రస్తుతం, ఈ నల్లాలో మురుగునీరు ప్రవహిస్తోంది, మరియు సరైన పక్క గోడలు లేకపోవడం వల్ల సమీప నివాసితులు, పాదచారులు మరియు వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. ఈ రక్షణ గోడల నిర్మాణం నేల కోతను నివారించడానికి, ప్రజా భద్రతను మెరుగుపరచడానికి మరియు మెరుగైన మురుగునీటి నిర్వహణకు సహాయపడుతుందని తెలిపడం జరిగింది . ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బిజ్జా శ్రీనివాస్ గౌడ్, నక్క కిషోర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నగర్‌లోగల, శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి 2,51,000 విరాళం



కుత్బుల్లాపూర్ జూన్ 8(వాయిస్ టుడే ): ( 2,51,000 ) రెండు లక్షల యాభై ఒక వేల రూపాయలను ఆలయ కమిటీ వారికి విరాళంగా అందజేశారు రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, పెద్దలు, శ్రీ కె.యం.ప్రతాప్ ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ.. గతంలో కూడా గణేష్ నగర్ ఆలయ నిర్మాణంలో మరియు గణేష్ నగర్ అభివృద్ధికి సహకరించడం జరిగిందన్నారు. గణేష్ నగర్ వాసులకు తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ నల్ల పోచమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షులు బాలకృష్ణ, ఉపాధ్యక్షులు మట్ట శరత్ కుమార్ గౌడ్, కాష నరసింహ రెడ్డి, కోశాధికారి పి.శేఖర్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు : ప్రసాద్ గౌడ్, బి.శ్రీనివాస్, వెంకటయ్య, డి. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## జూన్ 10న జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయండి

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపు

కుత్బుల్లాపూర్ జూన్ 8(వాయిస్ టుడే): పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి తరపున జూన్ 10 నాడు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నాను నిర్వహిస్తున్నామని కావున అట్టి ధర్నాలో కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ నేడు సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే ఏసురత్నములు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినంక పెట్రోల్ డీజిల్ ధరలు అమాంతం పెరిగిపోయి నిత్యవసర వస్తువుల ధరలు రెండు రెట్లు ఎక్కువ పెరగడం వల్ల ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ధరలు పెరుగుతున్నాయి కానీ వారి ఆర్థిక పరిస్థితులు మాత్రం మెరుగవట్లేదని అన్నారు. అదే మోడీ మిత్రులైన ఆదాని, అంబానీలఆర్థిక పరిస్థితులు వేల కోట్లు పెరిగాయని, నిత్యం మోడీ ఇతర దేశాలకు వెళ్లి తన సహజ మిత్రుడు అయినటువంటి ఆదాని కీ అనేక కాంట్రాక్టులు ఇప్పించి లక్షల కోట్లాది రూపాయలను సంపాదించి పెడుతున్నాడని, మోడీకి ఓటు వేసినటువంటి పేద ప్రజల సంపాదన పెరుగుదలకు మాత్రం కృషి చేయట్లేదని అన్నారు. దేశంలో రోజురోజుకు పేదరికం పెరిగిపోతుందని, ఇప్పటికైనా వస్తువుల ధరలు తగ్గించి పేద ప్రజల ఆర్థిక స్థితిలను పెంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉన్నదని దానికోసం ప్రజలంతా ఐక్యమై పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కావున భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహారెడ్డి ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు సిపిఐ నాయకులు దేవనందం, జానకిరామ్, ఇమామ్, కృష్ణ, నాగేశ్ చారి యువజన నాయకుడు కీర్తి తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన వంట గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి

### లేకపోతే బీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది!

### కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్ణయంపై కుత్బుల్లాపూర్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి తీవ్ర ఆగ్రహం



కుత్బుల్లాపూర్ జూన్ 8(వాయిస్ టుడే ): సామాన్య ప్రజలపై మరోసారి భారాన్ని మోపుతూ వంట గ్యాస్ ధరలను పెంచిన కేంద్ర బీజేపీ ప్రభుత్వ నిర్ణయాన్ని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) తీవ్రంగా ఖండిస్తోందని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వీరారెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేవలం మూడు నెలల వ్యవధిలోనే వంట గ్యాస్ ధరలను పదేపదే పెంచుతూ కేంద్ర ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక భారాన్ని మరింత పెంచిందన్నారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు, రవాణా ఖర్చులు పెరిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న సమయంలో గ్యాస్ ధరల పెంపు ప్రజల వంటింటిపై మరో పెద్ద దెబ్బగా మారిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు మేలు చేస్తూ, సామాన్య ప్రజల జీవితాలను భారంగా మారుస్తోందని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి, ధరల పెంపులతో ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం బాధ్యతారాహిత్య పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. "వంట గ్యాస్ విలాస వస్తువు కాదు... ప్రతి ఇంటి అవసరం. ప్రజల కష్టాలను అర్థం చేసుకోకుండా ధరలు పెంచడం అమానుషం. కేంద్ర ప్రభుత్వం వెంటనే పెంచిన గ్యాస్ ధరలను వెనక్కి తీసుకోవాలి. లేకపోతే బీఆర్ఎస్ పార్టీ ప్రజల పక్షాన రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతుంది" అని వీరారెడ్డి నరేందర్ రెడ్డి హెచ్చరించారు.



## అంకిరెడ్డిపల్లి ప్రధాన రహదారి మరమ్మత్తులు చేయాలి

నాగారం, జూన్ 8:-(వాయిస్ టుడే): కీసర మండలం అంకి రెడ్డి పల్లి గ్రామం నుండి అంకి రెడ్డి పల్లి (కీసరచౌరస్తా)ఎక్స్ రోడ్ వరకు వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా దెబ్బతిని, ప్రజల ప్రయాణానికి అత్యంత ప్రమాదకరంగా మారిందని, ఈ సమస్యపై భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కోలా బాలరాజు ఆధ్వర్యంలో కీసర మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ రాజలింగంకు కలిసి పిర్యాదు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి, ఎస్. వెంకట్ రెడ్డి, జి. తిరుమల రెడ్డి, జిల్లా మరియు మండల నాయకులు పాల్గొని రహదారి మరమ్మతులు తక్షణమే చేపట్టాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.



## నందిగామ గ్రామ ఉపసర్పంచ్ గోరెమియా ఆధ్వర్యంలో గ్రామసభ

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : పటాన్ చెరు మండల నందిగామ గ్రామంలో ఉపసర్పంచ్ గోరెమియా ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పటాన్చెరు ఎంపీడీవో యాదగిరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో గ్రామ సభలో ప్రధానంగా సమస్యల గ్రామ ప్రజలకు అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడం పైన చర్చించడం జరిగిందని, మొదటిది సానిటేషన్ గ్రామంలో నెలకొన్న మురుగునీరు వీధి దీపాల సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, తడిచిత్త పొడి చెత్త, వేరు చేసే, విధానంలో గ్రామస్తులకు అవగాహన కల్పించామణి, వచ్చే వర్షాకాలంలో మలుపు ప్రాంతలలో, ఇండ్ల మధ్య నీరు నిలవకుండ చూసుకునేలా, మరియు ఓటరు జాబితా మ్యాపింగ్, సవరణ, సెన్సెస్ పై గ్రామ ప్రజలకు సంబంధిత శాఖ అధికారులతో పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోరెమియ వార్డు సభ్యులు గ్రామపంచాయతీ కార్యదర్శి విజయ్ కుమార్ వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, ప్రజలు యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## రామేశ్వరం బండలో శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం 5వ వార్షికోత్సవం

### అంగరంగ వైభవంగా నిర్వహించిన కౌన్సిలర్ అంతిరెడ్డి

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : పటాన్ చెరు నియోజకవర్గం, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలో రామేశ్వరం బండ గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి దేవాలయం 5వ వార్షికోత్సవాన్ని 6వ వార్డు కౌన్సిలర్ అంతిరెడ్డి గ్రామ పెద్దలతో ,గ్రామ ప్రజలతో కలిసి అంగరంగ వైభవంగా పూజా కార్యక్రమాన్ని ప్రారంభించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఇంద్రేశం మున్సిపాలిటీ చైర్మన్ ప్రమీల, కౌన్సిలర్లు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాలు తీసుకోవడం జరిగింది, అనంతరం ఇరువురు మాట్లాడుతూ రామేశ్వరం బండ గ్రామానికి అంతిరెడ్డి మాజీ సర్పంచ్, మాజీ ఉప సర్పంచ్, మాజీ ఎంపీటీసీగా మరియు ఇప్పుడు 6వ వార్డు కౌన్సిలర్గా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి గ్రామంలో కులమతలకు అతితంగా దేవాలయాలను, మసీదులను, చర్చిలను నిర్మించడం, గ్రామ అభివృద్ధికి వీరి కుటుంబ సభ్యుల సహకారం ఉందని ఈరోజు జరిగిన పోచమ్మ తల్లి దేవాలయం 5వ వార్షికోత్సవాన్ని గ్రామ పెద్దల సమక్షంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, జోగిని బోనం ఎత్తుకొని గ్రామ ఆడపడుచులతో బోనాలతో ఊరేగింపుగా విచ్చేసి అమ్మవారికిబోనం సమర్పించడం చాలా సంతోషకరంగా ఉన్నదని అన్నారు, పోచమ్మ తల్లి ఆశీర్వాదంతో ప్రతి ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని సకాలంలో వర్షాలు పడి పంటలు బాగా పండాలని ప్రతి ఒక్కరికి నీటి సమస్య రాకుండా అందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో ఉండాలని మనస్ఫూర్తిగా అమ్మవారిని కోరుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బండి శంకర్,గడ్డ మీద ఆంజనేయులు ముదిరాజ్, ఎండీ సర్దార్, ఇబ్రహీం, కాన్సిలర్ రమేష్, అర్జున్, నవీన్, బి రాజు,ఎష్ట్ర రమేష్, సాయిలు, లోకేష్,



## ఇస్నాపూర్ మున్సిపాలిటీలోని ఇస్నాపూర్ మరియు పాశ మైలారం వార్డు సభ

### నిర్వహించిన గ్రామంలో చైర్మన్ మోటే సుమలత

పటాన్ చెరు (వాయిస్ టుడే న్యూస్) : ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిల జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇస్నాపూర్ మరియు పాశ మైలారం వార్డులలో వార్డు సభ నిర్వహించిన చైర్మన్ మోటే సుమలత మరియు కౌన్సిలర్లు ఆర్ఓ మధుసూదన్ రెడ్డి వార్డు సభా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మోటే సుమలత మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా ఇస్నాపూర్ మరియు పాశ మైలారం గ్రామంలోని 12వార్డులను కలుపుకొని ఇస్నాపూర్ జిల్లా ప్రజా పరిషత్ హై స్కూల్ లో వార్డు సభ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సభలో ప్రధానంగా సమస్యల ప్రభుత్వ ఇళ్ల స్థలాల పట్టలు రెగ్యురేషన్ చేయడం మరియు అర్హులకు ఇందిరమ్మ ఇల్లు కట్టుకోవడం పైన చర్చించడం జరిగిందని, మొదటిది సానిటేషన్ గ్రామంలో నెలకొన్న మురుగునీరు వీధి దీపాల సమస్య, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, తడిచిత్త పొడి చెత్త, వేరు చేసే, విధానంలో గ్రామస్తులకు అవగాహన కల్పించామణి, వచ్చే వర్షాకాలంలో పల్లపు ప్రాంతలలో, ఇండ్ల మధ్య నీరు నిలవకుండ చూసుకునేలా, మరియు ఓటరు జాబితా మ్యాపింగ్, సవరణ, సెన్సెస్ పై గ్రామ ప్రజలకు సంబంధిత శాఖ అధికారులతో పూర్తి అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్వో మధుసూదన్ రెడ్డి, ఎమ్మార్వో వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, పలు వార్డు సంబంధించిన ప్రజలు యువకులు, మహిళలు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్



(యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో.. వాయిస్ టుడే ప్రతినిధి ):– వంజరి కులస్తుల ఆత్మగౌరవ భవనాన్ని ప్రారంభించడానికి విచ్చేసిన తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, తెలంగాణ బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కి, ప్రభుత్వ సలహాదారు విహెచ్ హనుమాన్ రావుకి, భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి కి, మేమేశ్రీట్రో ప్రధానం చేసి సన్మానం చేసిన పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అజ్వర్వర్ పోత్నక్ ప్రమోద్ కుమార్లు ఉన్నారు.



## వసంతనగర్‌లో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌కు విశేష స్పందన

### మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమం



కూకట్‌పల్లి, జూన్ 8(వాయిస్ టుడే): కేపీహెచ్‌బీ కాలనీ వసంతనగర్ డివిజన్ పరిధిలోని సిక్స్ ఫేస్ట్ కాలనీలో ప్రజా ఆరోగ్య పరిరక్షణ లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి ఆధ్వర్యంలో, మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ తరఫున ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. మెడికవర్ హాస్పిటల్స్, వాసన్ ఐకేర్, ఏషియన్ డెంటల్ సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి కాలనీ వాసుల నుంచి విశేష స్పందన లభించింది. వందలాది మంది ప్రజలు హాజరై సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి పరీక్షలు, దంత పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచనలు పొందారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మందలపు సాయిబాబు చౌదరి సేవలను ప్రశంసించారు. రాజకీయ నాయకుడిగా మాత్రమే కాకుండా సామాజిక సేవకుడిగా ప్రజలకు అండగా నిలుస్తూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కొనియాడారు. మందలపు రోజారాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇప్పటికే పలు సేవా కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న మందలపు సాయిబాబు చౌదరి, ప్రజా సేవే తన లక్ష్యమని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించేందుకు కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహించిన ఈ ఉచిత హెల్త్ క్యాంప్ స్థానికంగా విశేష ఆదరణ పొందింది. ప్రజల సంక్షేమమే అసలైన రాజకీయమనే సందేశాన్ని ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసినట్లు పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, వైద్య నిపుణులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## డాట్ నెట్ డెవలపర్ల అన్వేషణలో గీతం




పటాన్ చెరు (వాయిస్ టుడే): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలోని అధునాతన సాంకేతిక పరిష్కారాల కేంద్రం (జాబూ) అనుభవజ్ఞులైన డాట్ నెట్ డెవలపర్ల కోసం నియామక ప్రక్రియ ప్రకటించింది. ఆసక్తి గల అభ్యర్థులు 2026 జూన్ 13, 14 తేదీలలో జరిగే డైరెక్ట్ వాక్–ఇన్ ఇంటర్వ్యూలో పాల్గొనవలసిందిగా కోరుతూ సోమవారం ఒక ప్రకటనను వెలువరించింది. పటిష్టమైన సాఫ్ట్ వేర్ సొల్యూషన్ల రూపకల్పన, అభివృద్ధి, అమలు చేయడంలో 3 నుంచి 20 సంవత్సరాల అనుభవం ఉన్న ప్రతిభావంతులైన నిపుణుల కోసం విశ్వవిద్యాలయం అన్వేషిస్తోందని తెలిపారు. అభ్యర్థులకు ASP.NET, MVC, .NET కోర్, వెబ్ API, and SQL సర్వర్ డేటాబేస్ టెక్నాలజీలలో బలమైన సాంకేతిక నైపుణ్యం ఉండాలని స్పష్టీకరించారు. దరఖాస్తుదారులు కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ లేదా సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీని కలిగి ఉండాలన్నారు. ఎడ్యుకేషన్ టెక్నాలజీ (EdTech) లేదా హెల్త్ కేర్ ఐటీ సిస్టమ్స్ లో అనుభవం అదనపు అర్హతగా పరిగణిస్తామని తెలిపారు.అభ్యర్థి అనుభవం, నైపుణ్యాలు, ఆయా పోస్టులకు అనుగుణంగా వారు ఒడుపుగా వ్యవహరించే విధానాన్ని అనుసరించి వార్షిక వేతన ప్యాకేజీ 3.5 లక్షల నుంచి 25 లక్షల రూపాయలు, లేదా అంతకంటే ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అసాధారణ ప్రతిభ ఉన్న వారికి, వారి యోగ్యత, నైపుణ్యం ఆధారంగా అధిక వేతనం అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు నోటిఫికేషన్ లో పేర్కొన్న క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేయడం ద్వారా లేదా అధికారిక వెబ్ సైట్ www.gitam.eduను సందర్శించడం ద్వారా నియామక ప్రక్రియ కోసం నమోదు చేసుకోవచ్చని వివరించారు. ఈ నియామక కార్యక్రమం, అత్యంత నైపుణ్యం కలిగిన టెక్నాలజీ వర్క్ ఫోర్సును నిర్మించడానికి, జాబూ వ్యవస్థను బలోపేతం చేయడానికి గీతం యొక్క నిరంతర నిబద్ధతను ప్రతిబింబిస్తోందని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



## ఘనంగా మూసాపేట్‌లో సీనియర్ పాత్రికేయులు దాదె వెంకట్ జన్మదిన వేడుకలు

### భగత్ సింగ్ స్ట్రీట్‌లో శుభాకాంక్షల వెల్లువ

కూకట్‌పల్లి, జూన్ 8(వాయిస్ టుడే)కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట్‌లో సీనియర్ పాత్రికేయులు దాదె వెంకట్ జన్మదిన వేడుకలు భగత్ సింగ్ స్ట్రీట్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వడ్ల అశోక్ చారీ, జిల్ల బాబురావు, సక్కురు బాబురావు, పగడాల వెంకటేష్, కోడిచర్ల అశోక్ కుమార్, జిల్ల హనుమంత్ రావు, జిల్ల శంకర్ తదితరులు పాల్గొని దాదె వెంకట్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారు మాట్లాడుతూ దాదె వెంకట్ సీనియర్ పాత్రికేయుడిగా సమాజ సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే విషయంలో కీలక పాత్ర పోషించారని, ప్రజా సమస్యలపై నిరంతరం గళమెత్తే జర్నలిస్టుగా గుర్తింపు పొందారని కొనియాడారు. ఆయన మరెన్నో సంవత్సరాలు ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి ఆనందోత్సాహాల మధ్య జన్మదినాన్ని జరుపుకున్నారు. కార్యక్రమం మొత్తం స్నేహపూర్వక వాతావరణంలో ఉత్సాహంగా సాగింది.



## ఇస్నాపూర్‌లో భవన నిర్మాణ కార్మికుల ఆందోళన వేతనాలు పెంచాలని డిమాండ్

పటాన్ చెరు (వాయిస్ టుడే): పటాన్‌చెరు నియోజకవర్గానికి చెందిన భవన నిర్మాణ కార్మికులు గత వారం రోజులుగా ఇస్నాపూర్‌లోని తమ యూనియన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.గత నెలలో సెంట్రింగ్ కార్మికులు చేపట్టిన నిరసనల్లో భవన నిర్మాణ కార్మికులను పక్కన పెట్టి తమ డిమాండ్లను ఏకపక్షంగా సాధించుకున్నారని కార్మికులు ఆరోపించారు. 44 రకాల వృత్తుల కార్మిక సంఘానికి అధ్యక్షుడిగా చిన్నారావు కొనసాగుతున్నప్పటికీ భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రస్తుతం స్క్వేర్ ఫీట్‌కు ఇస్తున్న రూ.300 వేతనాన్ని రూ.450కు పెంచాలని డిమాండ్ చేస్తూ గత వారం రోజులుగా ఆందోళనలు కొనసాగిస్తున్నామని యూనియన్ జనరల్ సెక్రటరీ యాదగిరి తెలిపారు.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి భవన నిర్మాణ కార్మికుల నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఇస్నాపూర్ నుంచి పటాన్‌చెరు నియోజకవర్గ కార్మికులు పెద్ద సంఖ్యలో బయలుదేరి వెళ్లారు.తెలంగాణ రాష్ట్ర భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సమ్మె విషయం తెలుసుకున్న పటాన్చెరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు శోభ కృష్ణారెడ్డి కార్మికులను పరామర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కార్మికులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సామాజిక భద్రత బోర్డు మెంబర్ కార్యదర్శి డి. చిన్నారావు, పటాన్‌చెరు నియోజకవర్గ అధ్యక్షుడు హెచ్. హనుమంత్ యాదగిరి, ఎం.డి. అలీ, తాపీ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు ఎం. మల్లకొండ రెడ్డి, సెంట్రింగ్ అధ్యక్షుడు ఆర్.ఏ. రాములు, చింత రామచందర్, డి. శ్రీనివాసులు, కె. మోహన్ రెడ్డి, కొమురయ్య, మేస్త్రీ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు ఎం. రమణయ్య చౌదరి, మిరయ్య, వీరారెడ్డి, మాలతి రామకృష్ణ, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ డిగ్రీ కాలేజీకి భూమి, నిధులను కేటాయించండి

### సీఎం రేవంత్‌రెడ్డిని కోరిన ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ పరమేశ్వర్‌రెడ్డి



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి ):– ఉప్పల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భూమితో పాటు భవనాల నిర్మాణానికి నిధులను కూడా కేటాయించాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఆదివారం ఉప్పల్ భగాయత్‌లో సీఎం రేవంత్‌రెడ్డి గారి చేతుల మీదుగా ఎంఎంటీసీ కార్యాలయం,100 పడకల ఏరియా ఆస్పత్రి నిర్మాణాలకు భూమి పూజ తర్వాత జరిగిన సభ వేదికపై వజ్రేష్ యాదవ్ ,పరమేశ్వర్‌రెడ్డి, రజితాపరమేశ్వర్‌రెడ్డి వినతిపత్రాలను అందచేశారు.ఉప్పల్‌లో డిగ్రీ కళాశాలను ఐదారేళ్ల క్రితమే ఏర్పాటు చేశారన్నారు. కానీ, నేటికి డిగ్రీ కళాశాల పాఠశాల భవనంలోనే నడుస్తుందన్నారు. దీంతో ఉప్పల్ భగాయత్‌లో 5 ఎకరాల స్థలంతో పాటు భవనాల నిర్మాణానికి నిధులను కేటాయించాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. తక్షణమే స్థల కేటాయింపు, నిధుల కోసం నివేదికను పంపించాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ మాజీ కార్పొరేటర్ మందముల్ల రజిత పరమేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోషామహల్‌లో గులాబీ జెండా ఎగరేలా శ్రేణులు సైనికుల్లా పనిచేయాలి: తలసాని శ్రీనివాస్ యాదవ్




కూకట్‌పల్లి, జూన్ 8(వాయిస్ టుడే): రానున్న ఎన్నికల్లో గోషామహల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ విజయం సాధించేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తలసాని శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో నాగేందర్ గౌడ్ అధ్యక్షతన జరిగిన గోషామహల్ నియోజకవర్గ సభ్యత్వ నమోదు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో పైరవీలకు తావు లేదని, కష్టపడి పనిచేసే వారికి మాత్రమే సముచిత గౌరవం లభిస్తుందని స్పష్టం చేశారు. కేసీఆర్ పాలనలో గోషామహల్‌లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రూ.10 కోట్లతో ఫిష్ మార్కెట్, డ్రైనేజీ, నాలా అభివృద్ధి వంటి అనేక పనులు జరిగాయని గుర్తు చేశారు.

ఈ నెల 24 నుంచి ప్రారంభమయ్యే ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు కావాలని, అక్రమ ఓట్లపై జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. డిజిటల్ విధానంలో సభ్యత్వ నమోదు జరుగుతుందని, ఇంటింటికీ వెళ్లి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేక ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. ప్రజల మధ్య ఉండి సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు రాంచందర్ రాజు,దిలీప్ గంతీ,శ్రీనివాస్ యాదవ్,బద్రి,అమర్,కిషోర్ గుపత్,నార్మల్ బాబు,ప్రశాంత్ , తదితరులు పాల్గొన్నారు.

# ముంబై కామాటీపుర మున్నూర్ వార్ సంఘం సేవలు ఆదర్శనీయం: కొండ దేవయ్య పటేల్






ముంబయి, జూన్ 9 (వాయిస్ టుడే): ముంబై నగరంలోని కామాటీపుర ప్రాంతంలో సుమారు రెండు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన మున్నూర్ వార్ సంఘం మరియు ట్రస్ట్ సేవలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని తెలంగాణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ అన్నారు. సంఘం నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పరిశీలించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. తెలుగు మూలాలు కలిగిన ఈ సమాజం మహారాష్ట్రలో స్థిరపడి, తమ భాష, సంస్కృతి, సంప్రదాయాలను తరతరాలుగా పరిరక్షిస్తూ సమాజ సేవలో ముందంజలో కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏడు అమ్మవారి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోశమ్మ దేవాలయం, మరియమ్మ దేవాలయం, హనుమాన్ మందిరం వంటి ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలుగానే కాకుండా తెలుగు సంస్కృతి పరిరక్షణకు, సమాజ ఐక్యతకు ప్రతీకలుగా నిలుస్తున్నాయని అన్నారు. సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ, ముంబై నగర నిర్మాణం, అభివృద్ధిలో మున్నూరు కాపు సమాజానికి చెందిన కుటుంబాలు కీలక పాత్ర పోషించాయని తెలిపారు. ఉమ్మడి హైదరాబాద్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన తెలుగు కుటుంబాలు ముంబై, థానే, చంద్రపూర్, వర్లీ, పూణే, నాందేడ్, భివండి తదితర ప్రాంతాల్లో స్థిరపడి వ్యాపార, పారిశ్రామిక, సామాజిక రంగాల్లో విశేష సేవలు అందించాయని వివరించారు. మహారాష్ట్ర రాజకీయ చరిత్రలో మున్నూరు కాపుల పాత్ర విశేషమని పేర్కొంటూ, మాజీ ముఖ్యమంత్రి మరొట్రావు కన్నంవార్ సేవలను గుర్తు చేశారు. రాష్ట్ర రాజకీయ, సామాజిక అభివృద్ధిలో తెలుగు మూలాలు కలిగిన పలువురు నాయకులు కీలక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు.

సంఘం చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని కొండ దేవయ్య పటేల్ పేర్కొన్నారు. సమాజ సభ్యుల వివాహాలు, శుభకార్యాల కోసం ఫంక్షన్ హాల్‌ను కేవలం రూ.1,000 అద్దెతో అందుబాటులో ఉంచడం, అవసరమైన వారికి తక్కువ చార్జీలతో వసతి సదుపాయం కల్పించడం, వితంతువులకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, పేద కుటుంబాలకు అత్యవసర సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. నిజాం హైదరాబాద్ రాష్ట్ర కాలంలో మనమంతా ఒకే సామాజిక, సాంస్కృతిక వాతావరణంలో జీవించామని, నేడు రాష్ట్రాలు వేర్వేరైనా మన మూలాలు, భాష, ఆచారాలు, సంప్రదాయాలు ఒకటేనని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ, మహారాష్ట్ర రాష్ట్రాల్లోని మున్నూరు కాపు సమాజం పరస్పర సహకారం, ఐక్యతతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్త లక్ష్మణ్ పటేల్, ముంబై తెలుగు మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు శకెల్లీ రాములు పటేల్, ప్రధాన కార్యదర్శి సంగినేని రవీంద్ర పటేల్, ట్రస్ట్ సభ్యులు శేఖర్ పటేల్ తదితరులు పాల్గొన్నారు. సమాజ అభ్యున్నతి, యువత విద్యా వికాసం, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణ కోసం ఇలాంటి సంస్థలు చేస్తున్న సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని వారు పేర్కొన్నారు.

# తెలుగు భాష, సంస్కృతి పరిరక్షణకు అందరూ కృషి చేయాలి: కొండ దేవయ్య పటేల్





ముంబయి, జూన్ 9 (వాయిస్ టుడే): ముంబయిలో నిర్వహించిన తెలుగు ముంబయి ఆంధ్ర మహాసభ మూడు రోజుల సాంస్కృతిక వేడుకలు ఘనంగా ముగిశాయి. ముగింపు కార్యక్రమానికి తెలంగాణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్, వాయిస్ టుడే ఎండీ కొత్త లక్ష్మణ్ పటేల్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా కొండ దేవయ్య పటేల్ మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించడం ప్రతి తెలుగు వ్యక్తి బాధ్యత అని అన్నారు. మహారాష్ట్రలో నివసిస్తున్న తెలుగు ప్రజలు తమ భాషా, సాంస్కృతిక మూలాలను కాపాడుకుంటూ కొత్త తరాలకు అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రాలు వేర్వేరైనా తెలుగు ప్రజల మధ్య ఐక్యత, సాంస్కృతిక అనుబంధం మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. సమాజ అభ్యున్నతి, యువతలో సాంస్కృతిక విలువల పెంపు కోసం ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. వాయిస్ టుడే ఎండీ కొత్త లక్ష్మణ్ పటేల్ మాట్లాడుతూ తెలుగు సంఘాలు సమాజ సేవతో పాటు భాషా పరిరక్షణలోనూ కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. భాషా వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో సాంస్కృతిక సంస్థల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మహాసభ అధ్యక్షులు కొండ రెడ్డి అతిథులకు పూల బొకేలు అందజేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం సాంస్కృతిక రంగంలో విశేష సేవలందించిన పలువురు కళాకారులను సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ముంబై తెలుగు మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు శకెల్లీ రాములు పటేల్, ప్రధాన కార్యదర్శి సంగినేని రవీంద్ర పటేల్, చింత వినాయక్ తదితరులు పాల్గొన్నారు. తెలుగు సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబించిన ఈ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

# బహిరంగ సభలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి పాల్గొన్న కుత్బుల్లాపూర్ మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్



కుత్బుల్లాపూర్ జూన్ 08(వాయిస్ టుడే ): శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ లో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసీ) నూతన కార్యాలయ భవన నిర్మాణానికి ఘనంగా భూమి పూజ నిర్వహించారు, అనంతరం కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని బాచుపల్లి లో 150 కోట్ల వ్యయంతో నిర్మించిన ఫ్లైఓవర్ తో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఆధునిక హంగులతో నిర్మించబోయే నూతన సీఎంసీ కార్యాలయం తో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం పట్టణాభివృద్ధికి కట్టుబడి ఉందని పట్టణాల అభివృద్ధికి కోట్ల రూపాయల విలువైన నిధులను కేటాయిస్తున్నామని తెలియజేశారు, రోజు లక్షలాదిమంది ప్రయాణించి బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణంతో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోయాయని అదేవిధంగా తొందరలోనే గాజులరామారంలో 100 ఎకరాలలో నిర్మించబోయే అంతర్జాతీయ బస్ టర్మినల్ శంకుస్థాపన సైతం చేయనున్నట్లు తెలియజేశారు, దీంతో కుత్బుల్లాపూర్ నియోజక వర్గం అభివృద్ధికి మరో ముందడుగు అని ప్రజలకు మరింత మెరుగైన రవాణా సదుపాయం అందుబాటులోకి వస్తుందని తెలియజేశారు.

ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోకి ఆరు సర్కిల్ లలో చేపట్టబోయే అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, నూతన మంచినీటి పైపులైన్లు, పార్కుల అభివృద్ధి, ట్రాఫిక్ కూడల ఆధునీకరణ, వాటికి సంబంధించిన సుమారు 200 కోట్ల రూపాయల విలువైనపలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పూర్తిస్థాయి నివేదికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభా వేదికపై అందజేశారు, దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ మంత్రి శ్రీధర్ బాబు రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి అనిల్ కుమార్ యాదవ్ శేర్లింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ పట్నం మహేందర్ రెడ్డి నవీన్ యాదవ్, మల్ రెడ్డి రంగారెడ్డి,జిల్లా అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ ఇంచార్జ్ హనుమంత్ రెడ్డి, జిల్లా కలెక్టర్ సైబరాబాద్ మునిసిపల్ కమిషనర్ మరియు ఇతర ప్రభుత్వ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## తూము భాస్కర్ రావు 7వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

### -- కాంగ్రెస్ నేతల స్మరణ సభ

కూకట్‌పల్లి, జూన్ 8(వాయిస్ టుడే): మూసాపేట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు స్వర్గీయ తూము భాస్కర్ రావు 7వ వర్ధంతి సందర్భంగా నవయువక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ బి-బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, మాజీ కార్పొరేటర్లు పగుడాల బాబురావు, తూము శ్రవణ్ కుమార్, ఏ. శ్రీధర్, తూము వెంకటేష్, తూము నర్సింగ్ రావు, వడ్ల వెంకటేష్, కోటి రాజు, కాస నర్సింహా యాదవ్, ఉప్పు వేణు, సప్పిడి భాస్కర్, సాగర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కీర్తిశేషులు తూము భాస్కర్ రావు గారు ప్రజా సేవకు చేసిన కృషి చిరస్మరణీయమని, ఆయన ప్రజల హృదయాల్లో ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు.



## దివంగత వెంకటేశ్వర్లకు ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఘన నివాళి

ఖమ్మం, జూన్ 9: (వాయిస్ టుడే) : ఖమ్మం బురహాన్‌పురం వాస్తవ్యులు వై.కే. బాబు కుమారుడు వెంకటేశ్వర్లు సోమవారం పరమపదించారు. విషయం తెలుసుకున్న వెంటనే బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర దివంగత వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, రాపర్తి శరత్, శెట్టి రంగారావు, మదూరు సైదారావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. వెంకటేశ్వర్లు మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేసిన ఎంపీ వద్దిరాజు, ఆయన తల్లిదండ్రులు బాబు, రాధ, సతీమణి శ్రీదేవి, కుమారులు ప్రీతమ్ కుమార్, వంశీకృష్ణలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని కల్పించాలని భగవంతుడిని ప్రార్థించారు.



## బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన యోధుడు బీఆర్ భగవాన్ దాస్

### బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ సహకారంతో ఇండ్ల పట్టాలు

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్

హనుమకొండ, (వాయిస్ టుడే): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం పోరాడిన యోధుడు బీఆర్ భగవాన్ దాస్ అని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్,మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బీఆర్ భగవాన్ దాస్ జయంతి సందర్భంగా హనుమకొండ అశోక జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరంగల్ నగరంలో సంఘటిత,అసంఘటిత రంగ కార్మికుల హక్కుల సాధన కోసం భగవాన్ దాస్ నిరంతరం పోరాటం చేశారని అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు కోచ్ ఫ్యాక్టరీతో పాటు ఇతర పరిశ్రమల ఏర్పాటు,నగరానికి తాగునీటి సమస్య పరిష్కారం కోసం కూడా ఆయన విశేష కృషి చేశారని తెలిపారు.

భగవాన్ దాస్ స్థాపించిన గుడిసెల కాలనీలలో నివసిస్తున్న పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సహకారంతో ఇండ్ల పట్టాలు అందించి వారి కలలను సాకారం చేశామని దాస్యం వినయ్ భాస్కర్ పేర్కొన్నారు. బీఆర్ భగవాన్ దాస్ ఆశయాలు,స్ఫూర్తితో ప్రజల తరపున నిరంతరం పోరాడుతానని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్,జోరిక రమేష్,నాయకులు పులి రజినీకాంత్,పానుగంటి శ్రీధర్,కొడకండ్ల సదాంత్,గొర్రె విజయ్,కాల్వ సుదర్శన్,శ్యామ్ సుందర్ రెడ్డి,వినోద్ పాల్గొన్నారు.

# మున్సిపలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలి**

**హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్**



హనుమకొండ, (వాయిస్ టుడే): పరకాల మున్సిపాలిటీలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. పరకాల మున్సిపల్ కమిషనర్‌గా గ్రూప్-1 అధికారి పోతరాజు పవన్ ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో విధుల నిర్వహణ,మున్సిపాలిటీ పరిపాలన,అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్ర అవగాహన కల్పించే ఉద్దేశ్యంతో సోమవారం జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్య నిర్వహణ,ఘన వ్యర్థాల నిర్వహణ, వీధి దీపాల నిర్వహణ,పన్నుల వసూళ్లు,మౌలిక వసతుల కల్పన, ఇంటి నంబర్ల కేటాయింపు,పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ,అక్రమ నిర్మాణాల నియంత్రణ, వివిధ గ్రాంట్ల కింద నిధుల వినియోగం తదితర అంశాలపై కలెక్టర్ విస్తృతంగా సమీక్షించారు.

మున్సిపల్ సేవలు ప్రజలకు సకాలంలో పారదర్శకంగా అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. సేవలను నిర్దేశిత గడువులోగా అందించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రజల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించే విధంగా వ్యవస్థను బలోపేతం చేయాలని పేర్కొన్నారు. వీధి దీపాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు విద్యుత్ వినియోగాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం పర్యవేక్షించి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వివిధ అభివృద్ధి పనులకు మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని,నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని ఆదేశించారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నూతన కమిషనర్ పోతరాజు పవన్ పట్టణ అభివృద్ధి, ప్రజాసేవలకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయంతో పనిచేసి మున్సిపాలిటీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో పరకాల మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్,ఏఈ రవీందర్,టీపీఎస్ సుమన,టీపీబీఓ సందీప్,జూనియర్ అకౌంట్స్ అధికారి అర్షద్ పాల్గొన్నారు.



## రాజ్యసభ సభ్యుడిని మర్యాదపూర్వకంగా కలిసిన ఈ.వి

హనుమకొండ, (వాయిస్ టుడే) : నూతనంగా రాజ్యసభ సభ్యుడిగా బాధ్యతలు స్వీకరించిన వేం నరేందర్ రెడ్డి ని సోమవారం హైదరాబాద్ లోని ఆయన నివాసంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి శ్రీనివాస్ రావు మరియు పీఆర్వో యం.కిరణ్మయి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డికి శాలువా కప్పి సత్కరించి,రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై బాధ్యతలు స్వీకరించినందుకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఐటీఐ - ఏటీసీ కాజీపేటలో జాతీయ అప్రెంటిస్‌షిప్ మేళా

**70 మంది అభ్యర్థుల ఎంపిక**

**మేళాకు హాజరైన పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు**



కాజీపేట, (వాయిస్ టుడే) : అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ప్రభుత్వ ఐటీఐ కాజీపేట, ములుగు రోడ్‌లోని ప్రభుత్వ ఐటీఐ వరంగల్ క్యాంపస్‌లో సోమవారం ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా (PMNAM) నిర్వహించారు. ఈ మేళాలో ఐటీఐ పూర్తి చేసిన అభ్యర్థులతో పాటు జూలై-2026లో పరీక్షలు రాయనున్న అభ్యర్థులు కలిపి మొత్తం 180 మంది పాల్గొన్నారు. మేళాకు పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరై అభ్యర్థుల ప్రతిభను పరిశీలించి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 70 మంది అభ్యర్థులను అప్రెంటిస్‌షిప్ అవకాశాల కోసం ఎంపిక చేసినట్లు ప్రభుత్వ ఐటీఐ--ఏటీసీ కాజీపేట ప్రిన్సిపాల్ పొన్నాల వేణు ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి అప్రెంటిస్‌షిప్ మేళాలు యువతకు ఉపాధి అవకాశాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఇటువంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



## తొర్రూరు మున్సిపాలిటీలో సమస్యలను పరిష్కరించాలి

**అర్హులైన లబ్ధిదారులకు ఇండ్లు పంచాలి**

తొర్రూరు , జూన్ 8 వాయిస్ టుడే : తొర్రూర్ మున్సిపాలిటీలో పేరుకుపోయిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్, ఎండి యాకూబ్ లు అధికారులను కోరారు. సోమవారం మండల కేంద్రంలో మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన 9,10 వార్డు సభ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ చైర్మన్ లకు సిపిఎం పార్టీ తొర్రూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో కూడిన వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా నాయకులు బొల్లం అశోక్ , తొర్రూర్ మండల కార్యదర్శి ఎండి యాకుబ్ మాట్లాడుతూ, తొర్రూరు పట్టణ కేంద్రంలో నిర్మాణం పూర్తయిన 280 డబల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులైన పేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. చాలాకాలం నుండి ఇదిగో పంచుతాం అదిగో పంచుతామని పేద ప్రజలకు ఆశలు చూపుతూ, ప్రజలు మభ్యపెడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణంలో మొదటి విడతలో మంజూరైన ఇందిర ఇండ్లు పూర్తిస్థాయిలో లబ్ధిదారులు నిర్మాణం చేసుకోలేదని, నిర్మాణం చేయని, ఇండ్లను కట్టుకోగలిగిన లబ్ధిదారులకు ఇచ్చి, వృధా కాకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ కమిషనర్ పాలకవర్గం పైన ఉందని వారు ఈ సందర్భంగా తెలిపారు. చాలాసార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చిన అప్పటికి కూడా, పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని వారు అన్నారు. 9,10 వార్డులు పాత ఊరు కావడం వల్ల గల్లీ ఇరుకుగా ఉండి, చెత్త తీసుకురావడానికి ట్రాక్టర్ గల్లీలలోకి పోవడం లేదని, వాటిని ట్రాక్టర్లు, వేరే వెహికల్స్ పోయే విధంగా వెడల్పు చెయ్యాలని, అదేవిధంగా అస్తవ్యస్తంగా ఉన్నటువంటి సీసీ రోడ్లు డ్రైనేజి పనులను పూర్తి చేసి ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా చూడాలని వారు అధికారులను కోరారు. పై సమస్యల పరిష్కారం కోసం అధికారులు పాలకవర్గం కృషి చేయాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని లేకుంటే ప్రజలందరిని కలుపుకొని సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన,పోరాటాలు నిర్వహిస్తామని వారు అధికారులను, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి జమ్ముల శ్రీను, వెంకట్ రెడ్డి, తిమ్మడి రవి, యాకన్న, శ్రీరంగం రామకృష్ణ ,రాధ, దస్తరి భాగ్య, ఎండి షమీనా, అమీనా, శోభ, శ్రీలత లక్ష్మి, చెన్నమ్మ, సౌజన్య, శాంతమ్మ, ఈగ శోభ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్ట్‌ల పిల్లలకు 100% శాతం ఫీజు రాయితీ కల్పించాలనీ జిల్లా కలెక్టర్‌కు టీయూడబ్ల్యూజేయూ వినతి

వరంగల్ ( వాయిస్ టుడే ) జూన్ 08 : గుర్తింపు పొందిన వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు జిల్లాలోని ప్రైవేట్ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజేయూ) వరంగల్ జిల్లా కన్వీనర్ మీర్జా ఫతేహుల్ల బేగ్ నాయకత్వం లో జిల్లా ప్రతినిధుల బృందం జిల్లా కలెక్టర్ సత్య శారదా కు సోమవారం ప్రజావాణి లో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో,ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడంలో జర్నలిస్టులు కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ,జిల్లాస్థాయిలో పనిచేస్తున్న అనేక మంది జర్నలిస్టులు స్కూల్ ఫీజుల విషయం లో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. పెరుగుతున్న విద్యా ఫీజుల కారణంగా తమ పిల్లల చదువుల భారాన్ని భరించడం కష్టంగా మారిందని,అందువల్ల గుర్తింపు పొందిన జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో పూర్తి ఫీజు మినహాయింపు కల్పించాలని కోరారు. సమస్య పై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ దీనిపై త్వరలోనే తగిన పరిష్కారం తీసుకునేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ సానుకూల స్పందనపై జర్నలిస్టు సంఘం ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ,జర్నలిస్టుల పిల్లల విద్యా భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని త్వరితగతిన అనుకూల నిర్ణయం తీసుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ అబ్దుల్ రజాక్ అక్రమ్,మహమ్మద్ ఫాజలుల్ రెహ్మాన్ వాజిద్,మహమ్మద్ రియాజ్ఉద్దీన్,మహమ్మద్ నాయబ్ రసూల్,మొహమ్మద్ మోమిన్,మహమ్మద్ ముస్తాబా రాజా ఉర్ రెహ్మాన్,సయ్యద్ సిదిక్,మహమ్మద్ అమీర్ ముదసిర్ నాజ్,షేక్ జావిద్,షేక్ వాహేద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల పట్టికలు ప్రదర్శించాలి

**- కలెక్టర్‌కు విద్యార్థి సంఘాల వినతి**



వరంగల్( వాయిస్ టుడే ) జూన్ 08 : జిల్లాలోని కార్పొరేట్,ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాలను తప్పనిసరిగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఐక్య విద్యార్థి సంఘాలు కోరాయి. ఈ మేరకు ఏబీఎస్ఎఫ్, స్వేరోస్, బీఎస్ఎఫ్, బీఎస్‌యూ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదకు ప్రజావాణిలో వినతిపత్రాన్ని వారు సమర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేష్,శనిగరపు రాజేంద్రప్రసాద్,మంద సురేష్,శ్యామ్ మాట్లాడుతూ విద్య హక్కు చట్టం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుల వివరాలను ప్రతి ప్రైవేట్ పాఠశాల ఆవరణలో స్పష్టంగా ప్రదర్శించాలని, దీంతో తల్లిదండ్రులు ఫీజుల వివరాలను తెలుసుకుని అధిక వసూళ్ల బారిన పడకుండా ఉంటారని తెలిపారు.చాలా మంది తల్లిదండ్రులకు ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుల వివరాలు తెలియకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు నిర్ణయించిన మొత్తాన్ని చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు.ప్రభుత్వం నిబంధనలు అమల్లో ఉన్నప్పటికీ అధికారుల పర్యవేక్షణ లోపంతో కొన్ని ప్రైవేట్ పాఠశాలలు ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులకు ఆర్థిక భారం మోపుతున్నాయని ఆరోపించారు.ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవడంతో పాటు,ఫీజుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రదర్శించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు.

## హస్తం కండువా కప్పుకున్న 50 కుటుంబాలు



ఖమ్మం , జూన్ 8 ( వాయిస్ టుడే ): దశాబ్దాలుగా మా ప్రాంతంలో జరగని అభివృద్ధి.. మంత్రి పొంగులేటి శీనన్న వచ్చిన తర్వాతే కళ్లముందు సాక్షాత్కరిస్తోంది. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అర్హులకు ప్రాధాన్యత ఇవ్వడం, మా పొన్నేకల్ గ్రామంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్' నిర్మిస్తుండటమే ఇందుకు నిదర్శనం. మా గ్రామానికి, మా ప్రాంతానికి మంత్రి పొంగులేటి ఇస్తున్న ఈ ప్రత్యేక ప్రాధాన్యతను గుర్తించే మేమంతా కాంగ్రెస్ బాట పట్టామని పార్టీలో చేరిన పలువురు నేతలు పేర్కొన్నారు. సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంప్ కార్యాలయం వేదికగా ఖమ్మం రూరల్ మండలంలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. బీఆర్ఎస్, సీపీఎం సహా వివిధ పార్టీలకు చెందిన సుమారు 50 కుటుంబాల వారు కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమానికి, పొంగులేటి అభివృద్ధి మంత్రానికి ఆకర్షితులై పార్టీలో చేరారు. క్యాంప్ కార్యాలయ ఇన్‌ఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి వీరందరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి, సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. పొన్నేకల్ గ్రామ శాఖ ఆధ్వర్యంలో ఈ చేరికల ప్రక్రియ విజయవంతంగా సాగింది.




## ఖమ్మం కోర్టులో కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో సంబరాలు

ఖమ్మం కవి , జూన్ 8( వాయిస్ టుడే ) : న్యాయవాదుల భద్రత, వృత్తి గౌరవ పరిరక్షణకు కీలకమైన న్యాయవాద రక్షణ చట్టాన్ని రూపొందించి అమలు చేసిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ సోమవారం ఖమ్మం జిల్లా కోర్టు ఆవరణలో ఖమ్మం కాంగ్రెస్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో మిఠాయిలు పంచి సంబరాలు నిర్వహించారు. న్యాయవాదుల చిరకాల వాంఛగా ఉన్న ఈ చట్టం అమల్లోకి రావడం న్యాయ వ్యవస్థ బలోపేతానికి దోహదపడుతుందని పలువురు న్యాయవాదులు అభిప్రాయపడ్డారు.కార్యక్రమానికి ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎడ్లపల్లి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. న్యాయవాదులపై పెరుగుతున్న దాడులు, బెదిరింపులను అరికట్టేందుకు ప్రత్యేక చట్టం అవసరం చాలా కాలంగా ఉందని, ఆ అవసరాన్ని గుర్తించి న్యాయవాద రక్షణ చట్టం అమలు దిశగా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనీయులని పేర్కొన్నారు. ఈ చట్టం న్యాయవాదులకు భద్రత కల్పించడమే కాకుండా న్యాయ వృత్తి గౌరవాన్ని మరింత పెంచుతుందని అన్నారు. అనంతరం పలువురు కాంగ్రెస్ లీగల్ సెల్ న్యాయవాదులు మాట్లాడుతూ, ప్రజలకు న్యాయం అందించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి న్యాయవాదుల రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని అమలు చేయడం చారిత్రాత్మక నిర్ణయమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని న్యాయవాదులందరి తరఫున తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ సెల్ కన్వీనర్ సింగం జనార్ధన్, కాంగ్రెస్ లీగల్ సెల్ న్యాయవాదులు కర్లపూడి శ్రీనివాసరావు, బత్తుల బసవ పున్నయ్య, మలీదు నాగేశ్వరరావు, రావూరి నరసింహారావు, ఏజీపీ రత్నాకర్, హేమంత్, కేఎల్ఎన్ శాస్త్రి, మోజెస్ క్రిస్టఫర్, ఇమ్మడి లక్ష్మీనారాయణ ఎస్వీ రమణ, ఎస్.కె లతీఫ్ , శేషగిరి, మద్దెల వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ గుప్తా, గురు కృష్ణ, కోటి, దానయ్య, శేఖర్, డోన్వన్ వెంకీయా, నరసింహారావు, రాకేష్ , పాటు మహిళా న్యాయవాదులు జాలావతి, ఆవుల అనురాధ, పద్మావతి, దేవరకొండ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

**మంత్రి తుమ్మల నాగేశ్వర రావు**

ఖమ్మం, జూన్ 8:( వాయిస్ టుడే): భావితరాలకు ఉపయోగపడేలా గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులను అత్యుత్తమ నాణ్యతతో అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, చేనేత జౌళి శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం రఘునాథపాలెం మండలం వి.వి.పాలెం గ్రామంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి రూ.97 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పశు వైద్యశాల భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా లిమంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూలి వి.వి.పాలెం గ్రామంతో తనకు సుదీర్ఘ అనుబంధం ఉందని తెలిపారు. 1982లో దివంగత ఎన్టీఆర్‌తో కలిసి తొలిసారిగా ఈ గ్రామానికి వచ్చినట్లు గుర్తు చేశారు. ఎన్టీఆర్ ప్రభుత్వ కాలంలో ఎత్తిపోతల పనులు చేపట్టామని, అనంతరం ప్రతి ప్రభుత్వ హయాంలోనూ గ్రామ అభివృద్ధికి కృషి చేసినట్లు పేర్కొన్నారు.ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లే గ్రామాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మంత్రి సూచించారు. జిల్లా పశు వైద్యశాల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ భూములపై సమగ్ర సర్వే నిర్వహించాలని ఆర్డీవోను ఆదేశించినట్లు చెప్పారు. పేదల్లో అత్యంత పేదలకు గృహ స్థలాలు అందించేందుకు అవసరమైన భూమిని గుర్తించాలని సూచించారు.

అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూలి మండల ఉపకేంద్ర స్థాయి లో పశు వైద్యశాల భవనం వి.వి.పాలెంలో నిర్మించడం ఈ ప్రాంత ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. వరికి



ప్రత్యామ్నాయ పంటలపై రైతులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. పశు సంపద రైతులకు ఆర్థిక బలాన్ని అందిస్తుందని, పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఈ భవనం పూర్తి స్థాయిలో ఉపయోగపడుతుందని తెలిపారు.

జిల్లా పశు వైద్యశాలకు పరిసర ఐదు, ఆరు జిల్లాల్లో మంచి గుర్తింపు ఉందని, కొన్ని మరమ్మతుల కోసం ప్రతిపాదనలు అవసరమని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు భూమి వినియోగం సమర్థవంతంగా ఉండాలని సూచించారు. పాఠశాలల కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ స్థలాల్లో లేదా వినియోగంలో లేని ప్రభుత్వ భవనాలను మరమ్మతులు చేసి ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, గ్రంథాలయ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.పురంధర్, వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్, తహసీల్దార్ శ్వేత, సర్పంచ్ కాపా ఆదినారాయణ, ఉప సర్పంచ్ గుగులోతు ప్రవీణ్ నాయక్, ఆత్మ చైర్మన్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృగశిర కార్తె... చేప ప్రసాదం... చేపల ఆహారం



ఖమ్మం, జూన్ 8 (వాయిస్ టుడే): మృగశిర రోజున ఇళ్లలో కచ్చితంగా చేపల కూర వండటం లేదా చేప ప్రసాదం తీసుకోవడం ఒక ఆనవాయితీ. అసలు ఏటా మృగశిర కార్తె రోజునే ఎందుకు చేపలు తినాలి? దీని వెనుక ఉన్న సీక్రెట్ ఏంటి, ఆధునిక వైద్యశాస్త్ర పరిశోధనలు ఏం చెబుతున్నాయి?లిరోహిణి కార్తెలో సూర్యుడి ప్రతాపానికి భూమి విపరీతంగా వేడెక్కుతుంది. ఆ తర్వాత వచ్చే మృగశిర కార్తెతో రుతుపవనాలు ప్రవేశించి, ఆకాశం మేఘావృతమై తొలి వర్షాలు పడతాయి. ఈ సమయంలో వాతావరణం ఉష్ణోగ్రత ఒక్కసారిగా పడిపోతుంది.

వేడి వాతావరణం నుంచి ఒక్కసారిగా చల్లని వాతావరణంలోకి మారే ఈ సంధి కాలంలో మానవ శరీరంలో 'వాత, పిత్త, కఫ' దోషాలలో అసమతుల్యత ఏర్పడుతుంది. వాతావరణంలో తేమ పెరగడం వల్ల బ్యాక్టీరియా, వైరస్‌లు వేగంగా వ్యాప్తి చెందుతాయి. దీనివల్ల జీర్ణవ్యవస్థ మందగించి, రోగనిరోధక శక్తి హఠాత్తుగా తగ్గుతుంది. ఫలితంగా జలుబు, దగ్గు, ఆస్తమా, శ్వాసకోశ ఇబ్బందులు తలెత్తుతాయి.

మృగశిర రోజున చేపలు తినడం వెనుక అటు ఆయుర్వేద నిపుణులు, ఇటు ఆధునిక పోషకాహార శాస్త్రవేత్తలు బలమైన కారణాలను విశ్లేషించారు. ఆయుర్వేద కోణంలో చూసుకుంటే.. చేపలు సహజంగానే శరీరానికి వేడిని ఇచ్చే గుణం కలిగి ఉంటాయి. వర్షాకాలం ప్రారంభంలో వాతావరణం చల్లబడినప్పుడు, శరీరంలో కఫం పెరగకుండా నిరోధించడానికి గుండెకు, ఊపిరితిత్తులకు తగినంత వేడి అవసరమవుతుంది. ఈ సమయంలో చేపలను ఆహారంగా తీసుకోవడం వల్ల శరీరం లోపలి ఉష్ణోగ్రత సమతుల్యంగా మారి, జలుబు, రొంప వంటి సమస్యలు దరిచేరవు. చేపల్లో నాణ్యమైన ప్రొటీన్లు, విటమిన్-డి, ఐరన్‌లతో పాటు ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఒమేగా-3 యాసిడ్స్ ఊపిరితిత్తులలో వచ్చే వాపును తగ్గిస్తాయి. ఆస్తమా ఉన్నవారికి ఇది శ్వాసనాళాలను ఫ్రీగా మార్చడంలో సహాయపడుతుంది.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే కార్యక్రమం

**గ్రీవెన్స్ డే కార్యక్రమం లో 26 ఫిర్యాదులు స్వీకరణ జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

సిరిసిల్ల, జూన్ 08 (వాయిస్ టుడే): ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్య ల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 26 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్ట పరంగా త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదు దారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి,అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటి కప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగు తుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

**ప్రజావాణిలో బీజేపీ కార్పొరేటర్ల వినతి**

కరీంనగర్, జూన్ 08(వాయిస్ టుడే): కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్పొరేటర్లు బండ రమణారెడ్డి,తోట అనిల్,ఎన్నం లక్ష్మీ ప్రకాష్,కర్రె పద్మ ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్లు మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు సమస్యలసుడిగుండంలో కొట్టుమిట్టాడు తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలలు ఈనెల 15న ప్రారంభమ వుతాయని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నగరంలోని అన్ని పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించి చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధానంగా త్రాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ,విద్యుదీకరణ,తరగతి గదుల మరమ్మత్తులు, మధ్యాహ్న భోజన కిచెన్ షెడ్లు,రక్షణ గోడలు తదితర విషయాలపై అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు.

## రైతు సమ్మేళనంను విజయవంతం చేయండి

**సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా**

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ - గంగాడి కృష్ణారెడ్డి**



జమ్మికుంట జూన్ 8 (వాయిస్ టుడే): రైతాంగానికి మేలు చేసే ప్రకృతి వ్యవసాయం కోసం బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈనెల 11న జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన రైతు సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం రోజున జమ్మికుంటలో స్థానిక బిజెపి నేతలతో రైతు సమ్మేళన ప్రోగ్రాం కు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ రసాయన ఎరువులు, పురుగుల మందుల వాడకాన్ని తగ్గించి, పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం (నాచురల్ ఫార్మింగ్ ) వైపు రైతులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో బి జె పి పార్టీ ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భూసారాన్ని కాపాడుకుంటూ, ప్రజలకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించడంలో ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో బిజెపి కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సమ్మేళన కార్యక్రమాలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయని తెలిపారు. జమ్మికుంటలో జరిగే రైతు సమ్మేళన కార్యక్రమానికి కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. జిల్లాలోని రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాలు, బిజెపి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొలకాని రాజు, మండల అధ్యక్షులు రమేష్ యాదవ్, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు వెంకటరమణ రెడ్డి, హుజురాబాద్ పట్టణ, మండల అధ్యక్షులు, తుర్పాటి రాజు, కొండల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి, ఆకుల రాజేందర్, ఓజ్జా శ్రీనివాస్, పుప్పాల రఘు, కైలాసకొటి గణేష్, ప్రశాంత్, ఆదువాల శ్రీధర్, కౌన్సిలర్లు కొలకాని రాజకుమారి, తుర్పాటి చందన-శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

**- నున్నా నాగేశ్వరరావు**



ఖమ్మం, జూన్ 8, ( వాయిస్ టుడే) : సామాన్యులు గృహ అవసరాల కోసం వినియోగించే గ్యాస్ సిలిండర్‌పై 29 రూ.లు పెంచటాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. కొంతకాలం క్రితమే ఒకేసారి 60 రూ.లు పెంచిన నరేంద్ర మోడీ ప్రభుత్వం మళ్ళీ 29 రూ.లు పెంచిన సామాన్యులపై పెనుభారం మోపిందన్నారు. అంతర్జాతీయంగా పెరగకపోయినా యుద్ధం సాకుతో మొత్తం 89 రూ.లు ఒక సిలిండర్‌పై పెంచటం గ్యాస్ కంపెనీలకు దోచి పెట్టటానికే అన్నారు. వెంటనే 89 రూ.ల పెంపును ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఐదు రాష్ట్రాల ఎన్నికలు ముగిసే వరకు ధరలు పెంచబోమని ప్రజల్ని నమ్మించిన బిజెపి ప్రభుత్వం ఎన్నికలు ముగిసిన వెంటనే నాలుగుసార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచిందని, తాజాగా గ్యాస్ ధరలు పెంచిందని కొద్ది రోజుల్లోనే వంట గ్యాస్‌పై 25 రూ.లు పెంచే ప్రయత్నం చేస్తుందన్నారు. వాణిజ్య సిలిండర్‌పై ఈ కాలంలోనే 1300 రూ.లు పెంచి మొత్తం 3000 రూ.లు దాటిందని, ఫలితంగా అన్ని ఆహార పదార్థాల ధరలు, గ్యాస్ పెట్రో ఆధారిత రవాణా యితర ధరలు ఆకాశానికి అంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభాలు కురిపిస్తూ, సామాన్యులకు కడగండ్లు కలిగిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనల సెగ తగిలిస్తామని హెచ్చరించారు.




## వార్డుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

**- పట్టణాభివృద్ధి లక్ష్యంగా ముందడుగు**

**మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్, కమిషనర్ మల్లికార్జున స్వామి**

జమ్మికుంట జూన్ 8 (వాయిస్ టుడే): జమ్మికుంట మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక--99 రోజుల కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వార్డ్ సభలను నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్), మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి తెలిపారు. సోమవారం 5, 7, 17, 18, 22, 25, 27 మరియు 30వ వార్డుల్లో నిర్వహించిన వార్డ్ సభల్లో వారు పాల్గొని అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఘన వ్యర్థాల నిర్వహణ నియమాలను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అలాగే జల్ సంచయ్ -- జల్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలో రైన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వార్డుల్లో డ్రైన్ల పూడికతీత, శుభ్రపరిచే పనులు, రుతుపవనాల సన్నద్ధత, తాగునీటి సరఫరా నిర్వహణ, నీటి నిల్వల నివారణ, పారిశుధ్య చర్యలు, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు మరియు నిర్వహణ, మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణ, ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వంటి అంశాలపై చర్చించినట్లు తెలిపారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అవసరమైన అభివృద్ధి, పారిశుధ్య పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, శ్రీనివాస్, ఐ. రమేష్‌తో పాటు కౌన్సిలర్లు యాట్ల సునీత అశోక్, ఫిరోజ్, బత్తు లక్ష్మణ్, కుతాడి తిరుపతి, శీలం శ్రీనివాస్, చందా రాజు, వార్డు అధికారులు మరియు పెద్ద సంఖ్యలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

**రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**154 దరఖాస్తుల రాక**



సిరిసిల్ల, జూన్ 08 (వాయిస్ టుడే): ప్రజావాణి అర్జీలు సకాలం లో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం లోని ఆడిటోరియం లో ప్రజా వాణి నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. మొత్తం దరఖాస్తులు 154 వచ్చాయి.జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం తో పాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని సూచించారు. ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

## బడిబాట గీతం ఆవిష్కరణ

**ప్రతి బిడ్డ బడిలోకి... ప్రతి కుటుంబం అభివృద్ధి వైపు!**

కరీంనగర్, జూన్ 08(వాయిస్ టుడే): ప్రతి బడి ఈడు పిల్లలు పలక పట్టాలి అప్పుడే పిల్లల భవిష్యత్తుకు బరోసా ఉంటుందని జిల్లా కలెక్టర్ చిత్ర మిశ్రా అన్నారు. కలెక్టరేట్ ఆడిటోరియంలోనిర్వహించిన కార్యక్రమంలో ప్రతి చిన్నారి పాఠశాల బాట పట్టాలని,ప్రతి గ్రామం విద్యా వికాసానికి నిలయంగా మారాలని సంకల్పంతో రూపొందించిన "బడిబాట"ప్రచార గీతాన్ని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డా. అశ్విని తనాజీ వాకడే పాల్గొన్నారు.జిల్లా విద్యాశాఖాధికారిఎస్. ప్రశాంత్ రెడ్డి గీతాన్ని కలెక్టర్ కు సమర్పించారు.ఈ గీతం కేవలం ఒక పాట కాదు ప్రభుత్వ పాఠశాలల పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించే ఒక విద్యా ఉద్యమం.ప్రతి బాలబాలికను బడిలో చేర్పించి,నాణ్యమైన విద్య అందించాలనే సందేశాన్ని ఈ గీతం హృదయాలకు చేరవేస్తుంది. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తలుగా అశోక్ రెడ్డి,శ్రీనివాస్ వ్యవహరించారు. జడ్పీహెచ్ఎస్ ఒద్యారం పాఠశాలలో చెందిన పదవీ విరమణ పొందిన మాజీ మండల విద్యాధికారి ఎనుగు ప్రభాకర్ రావు,కె.బి.శర్మ గరచయిత వెంకటేశ్వర్లు కృషితో ఈ గీతం రూపొందించబడింది.ప్రతి ఇంటి నుండి ఒక అడుగు బడివైపు,ప్రతి గ్రామం నుండి ఒక అడుగు విద్యావైపు అనే సందేశంతో రూపొందిన ఈ గీతం జిల్లా వ్యాప్తంగా బడిబాట కార్యక్రమానికి స్ఫూర్తినిస్తూ,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడంలో కీలక పాత్ర పోషించనుంది.విద్యే శక్తి విద్యే భవిష్యత్తు బడిబాటే ఆ భవిష్యత్తుకు బంగారు బాట అనే సందేశంతో జిల్లాలోని తల్లిదండ్రులు,ప్రజలు ప్రభుత్వ పాఠశాలలను ఆదరించి,తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని విద్యాశాఖ పిలుపునిచ్చింది.

# ఎల్‌పీజీ ధరల పెంపును వెంటనే తగ్గించాలి

**ఖాళీ సిలిండర్లు,కట్టెల పొయ్యితో కాంగ్రెస్ వినూత్న నిరసన**

**విశ్వగురు అంటూ ప్రజలపై ధరల భారం మోపుతున్న మోదీ**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**



కరీంనగర్, జూన్ 08(వాయిస్ టుడే): కేంద్రంలోని ఎన్‌డీఏ నేతృత్వ బీజేపీ ప్రభుత్వం పెంచిన ఎల్‌పీజీ గ్యాస్ ధరలకు నిరసనగా కరీంనగర్‌లోని ఇందిరా చౌక్ వద్ద జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన,వంటా వార్పు కార్యక్రమం చేపట్టారు.ఖాళీ సిలిండర్లతో,బీజేపీ వ్యతిరేక నినాదాల ప్లకార్డులతో రోడ్డుపై కట్టెల పొయ్యి మీద వంట చేస్తూ కాంగ్రెస్ నేతలు వినూత్నంగా నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అర్బన్ బ్యాంకు చైర్మన్ కర్ర రాజశేఖర్ మాట్లాడుతూ గత నెల రోజులుగా ప్రధాని నరేంద్ర మోడీ ఈ దేశంలో ఉన్న పేద మధ్యతరగతి ప్రజలంపైన రక్షకట్టినట్లుగా విపరీతమైన ధరలను పెంచుతూ పరిస్థితులను మనం చూస్తున్నాము. పెట్రోల్ డీజిల్ ధరలతో పాటు నిన్న ఎల్పిజి గ్యాస్ ధర ఒకేసారి 29 రూపాయలు పెంచి పేద ప్రజలపై భారం మోపుతున్న నరేంద్ర మోడీ సర్కారుకు వ్యతిరేకంగా రాహుల్ గాంధీ పిలుపుమేరకు వారు మొదటి నుండి చెబుతున్నట్లుగా ఈ ఎన్నికల తర్వాత నరేంద్ర మోడీ దేశ ప్రజలపై ధరల పెంపు భారం మోపబోతున్నారని దేశ ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఈ మోసపూరిత కేంద్ర ప్రభుత్వంపై మనమందరం పోరాడటానికి సిద్ధంగా ఉండాలని రాహుల్ గాంధీ హెచ్చరించినట్లుగానే ఎన్నికలు మోయగానే ఇప్పుడు ఇంధన ధరలు పెంచి వాటి ప్రభావం నిత్యవసరాలు పై పడటంతో పేద మధ్యతరగతి ప్రజలు తీవ్ర కష్టాలు ఎదుర్కొంటున్నారు.ఒకవైపు నరేంద్ర మోడీ నేను విశ్వగురు అని ఇది వికసిత భారత్ అని ప్రచారం చేసుకుంటూనే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని అంటగడుతూ రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు దేశవ్యాప్తంగా ఈ ధరలను దించేంతవరకు ఈ పోరాటం కొనసాగుతుందని ఈ పరిస్థితుల్లోనూ మోడీ సర్కార్ కు బుద్ధి వచ్చే విధంగా మా పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు.ప్రతి విషయంలో ఈ రాష్ట్రంలో ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీకి చెందిన ఎనిమిది మంది ఎంపీలు తమ నోరు విప్పాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.పెట్రోల్ డీజిల్ ధరల పెంపుతో సామాన్య ప్రజలపై విపరీతమైన భారం పడుతుంటే మీరు నోరు విప్పకుంటే మంచిది కాదని ఇక్కడున్న కేంద్రమంత్రి పార్లమెంట్ సభ్యులుతో పాటు రాష్ట్రంలో ఉన్న ఎంపీలు ఏం చేస్తున్నారు అని ప్రశ్నిస్తున్నాం,ప్రతి విషయంలో ఈ రాష్ట్ర ప్రభుత్వంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసే మీరు ఇప్పుడు ఎందుకు మౌనం పాటిస్తున్నారని, ఇప్పటికైనా ప్రజలు మిమ్మల్ని క్షమించాలంటే మీ నోరు విప్పాలని మోడీ అమిత్ షా ధరలను ఎందుకు పెంచుతున్నారని ప్రజలు మమ్మల్ని నిలదీస్తున్నారని మేము బయట తిరగలేని పరిస్థితి ఉందని ఈ రాష్ట్ర ప్రజల పక్షాన ప్రశ్నిస్తారా లేక చేతకాని దద్దమ్మలుగా మిగిలిపోతారా తేల్చుకోవాలని ఈ సందర్భంగా బిజెపి నేతలను ప్రశ్నిస్తున్నాము అని అన్నారు.మోదీ ప్రభుత్వం పేదోడి పొట్ట కొడుతోంది. 2014లో 400 రూపాయలు ఉన్న గ్యాస్ సిలిండర్ నేడు 1200 దాటింది.సబ్సిడీ ఎత్తేసి ఉజ్వల పథకాన్ని ఉత్త పథకంగా మార్చారు.గ్యాస్ నింపుకునే స్థోమత లేక మళ్లీ మహిళలు కట్టెల పొయ్యిల వైపు చూస్తున్నారు.ఇదేనా మీరు తెచ్చిన 'అచ్చే దిన్'? వంటింట్లో మంట పెట్టిన బీజేపీని గద్దె దించే వరకు కాంగ్రెస్ పోరాటం ఆగదు. కేంద్రం వెంటనే ధరలు తగ్గించి పాత సబ్సిడీని పునరుద్ధరించాలి. లేకపోతే ప్రజాగ్రహం తప్పదు అని హెచ్చరించారు.కార్యక్రమం అనంతరం రాష్ట్ర పెరిగిన గ్యాస్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం జిల్లా కలెక్టర్ కు వినతి పత్రంను కార్యాలయంలో అందజేశారు.ఈ నిరసన కార్యక్రమంలో నాయకులు ఉప్పుల అంజనీ ప్రసాద్,మల్లికార్జున రాజేందర్, పులి ఆంజనేయులు గౌడ్,కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, ఆకుల నరసయ్య,మడుపు మోహన్, పర్వతం మల్లేశం,గంట శ్రీనివాస్ కళ్యాణి,పడాల అజయ్ గౌడ్,భాస్కర్ నాయక్,వెన్నం రజిత రెడ్డి,మామిడి సత్యనారాయణ రెడ్డి,అబ్దుల్ రహమాన్, అమీర్, భగవాన్ దాస్, వాయినాల సత్యనారాయణ,బండి శరణ్య, సత్తినేని శ్రీకాంత్,షబానా మహమ్మద్,వీర దేవేందర్, సిరిపురం లావణ్య నాగ ప్రసాద్,అస్తపురం తిరుమల,జల్లోజు శ్రీనివాస్, బత్తిని చంద్రయ్య గౌడ్,మాదాసు శ్రీనివాస్, వజీర్, వసీం, శిల్ప,వేముల పుష్పలత, వంగల విద్యాసాగర్, కంకణాల అనిల్ కుమార్ గుప్తా,శ్రీరాముల రమేష్,నెల్లి నరేష్,సుదర్శన్,వహాబ్,పొన్నం మధు,పెంట శేఖర్,గోపు మల్లారెడ్డి, రూపురెడ్డి శ్రీనివాస్ రెడ్డి,హైమద్, మూల జైపాల్, నాగుల సతీష్,దండు రవీందర్,రామిడి తిరుపతి, సమ్లిముద్దిన్, చింతల కిషన్, శారద,ఎలగందుల మునీందర్, ఈశ్వరి, ఇమామ్, కలిముద్దీన్,కాసెట్టి శ్రీనివాస్,కొట్టే ప్రభాకర్, బొబ్బిలి విక్టర్,గడప శ్రీనివాస్,అందే శంకర్, ఇమ్రాన్, ఊకంటి రవీందర్ రెడ్డి,నూనె గోపాల్ రెడ్డి,జీడి రమేష్, జ్యోతి రెడ్డి, హసీనా,హర్ష మల్లేశం,వేల్పుల వెంకటేష్, పోరండ్ల రమేష్, ములకల కవిత,కోడూరు రవీందర్ గౌడ్, కర్రె పావని, మీసా రమాదేవి,కొలగాని అనిల్ పాల్గొన్నారు.

VOICE OF PRAJALU వాయిస్ ఆఫ్ ప్రజలు
ప్రజల గొంతుక - నిజం కోసం..
హైదరాబాద్
మంగళవారం 9 జూన్ 2026

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

## కవ్వంపల్లి సత్యనారాయణ

## డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి విశేష ఆదరణ



మానకొండూర్, జూన్ 08(వాయిస్ టుడే): హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో వే2న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన "డయల్ యువర్ ఎమ్మెల్యే" కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ఈ కార్యక్రమంలో పాల్గొని నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా ఆలకించారు.మానకొండూర్ నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 43 మంది ఫోన్ ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొని తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు.ప్రధానంగా ఇందిరమ్మ ఇళ్లు,తాగునీటి సరఫరా, రహదారుల మరమ్మ తులు, విద్యుత్ సమస్యలు,పింఛన్ల మంజూరు, సంక్షేమ పథకాల అమలు, వ్యవసాయానికి సంబంధించిన ఇబ్బందులు, రెవెన్యూ సమస్యలు తదితర అంశాలపై ప్రజలు తమ గోడును వినిపించారు.ప్రజలు ప్రస్తావించిన ప్రతి సమస్యను ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శ్రద్ధగా విని, వాటిపై సమగ్రంగా స్పందించారు.సమస్యల పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలను వివరించడంతో పాటు, కొన్ని సమస్యలపై వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా,ప్రజలు వెల్లడించిన అత్యవసర సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు సంబంధిత మండల స్థాయి అధికారులకు కూడా సమాచారం అందించి,త్వరితగతిన పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ నియోజకవర్గ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పాటుపడుతూనే ఉంటానన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపాలనే ఉద్దేశంతో ముందుకు సాగుతున్నట్టు డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు.ఇప్పటికే నియోజకవర్గానికి పెద్ద ప్రాజెక్టులు మంజూరు చేయించినట్టు ఆయన తెలిపారు.తిమ్మాపూర్ మండలం యాదవులపల్లిలో 200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షిల్ స్కూల్,బెజ్జంకి మండలానికి 100 కోట్లతో వ్యవసాయ కళాశాల, మానకొండూర్ లో 50 పడకల ఆస్పత్రి నిర్మాణ పనులు సాగుతున్నాయని చెప్పారు.ప్రధాన సమస్యగా మారిన గుండ్లపల్లి–కొత్తూర్ రోడ్ పనులు వేగవంతం,నిధుల మంజూరు విషయం ముఖ్యమంత్రి దృష్టికి ఇదివరకే తీసుకువచ్చినట్టు ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల కు డిమాండ్ విపరీతంగా పెరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ చెప్పారు.బీఆర్ఎస్ పాలించిన పదేళ్లలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకపోవడం,కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఇందిరమ్మ ఇల్లు పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేయడం వల్ల ఇందిరమ్మ ఇళ్ల కోసం అన్ని గ్రామాల నుంచి డిమాండ్ పెరిగిందని ఆయన వివరించారు. అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని,ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు.కొన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతుంటే కొందరు వ్యక్తులు వాటికి ఆటంకాలు సృష్టిస్తుండటం వల్ల పనులు ముందుకు సాగడం లేదన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాల్సిన అవసరం ఉందని ఆయన నొక్కి చెప్పారు. ప్రజల సమస్యల పరిష్కారానికి వారధిని నిలిచిన వే2న్యూస్ యాజమాన్యాన్ని డాక్టర్ కవ్వంపల్లి అభినందించారు.



## బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా సామాజిక పరివర్తన సదస్సు

జమ్మికుంట జూన్ 8 (వాయిస్ టుడే): బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పి) హుజురాబాద్ నియోజకవర్గం లోని జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక, హుజురాబాద్, కమలాపూర్ మండలాలలో సెక్టార్ మరియు బూత్ కమిటీల నాయకులతో జూన్ 7 ఆదివారం జమ్మికుంట వినాయక గార్డెన్ లో క్యాడర్ క్యాంపు శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం జరిగింది. హుజురాబాద్ అసెంబ్లీ అధ్యక్షులు మంద సమ్మయ్య సభాధ్యక్షుత చేపట్టి నాయకులతో మహనీయులకు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సీనియర్ నాయకులు దొడ్డి సమ్మయ్య హాజరై వివిధ మండలాల నుండి సమావేశానికి విచ్చేసిన నాయకులకు బహుజన సమాజ్ పార్టీ బలోపేతంకై దిశ నిర్దేషణ చేశారు.

బహుజన రాజ్యాధికారం లక్ష్యంగా ప్రతి ఒక్కరు బూత్ కమిటీ లెవెల్ లో సమర్థవంతంగా పని చేయాలని, 10 శాతం ఉన్న అగ్రకుల ఆధిపత్య నాయకులకు ఓట్లేసి అధికారాన్ని అంటగట్టడం మన దౌర్భాగ్యం అని అన్నారు. ఇకనైనా 90 శాతం ఉన్న బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ అగ్రకుల పేద ప్రజలందరూ బహుజన రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజన సమాజ్ పార్టీ బలమైన రాజకీయ శక్తిగా తయారు కావాలని పిలుపునిచ్చారు. దేశంలో మహనీయుల ఆశయ సాధనకై పనిచేసే ఏకైక పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో హుజరాబాద్ అసెంబ్లీ ఇన్చార్జిలు. వేల్పుల మల్లేశం, డాక్టర్ అంబాల ప్రభాకర్ (ప్రభు), ఎమ్మెల్యే, ఎంపీ కంటెస్టెంట్ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య, సీనియర్ నాయకులు , ఈదునూరి రమేష్, అసెంబ్లీ నాయకులు పెరిక శ్రీనివాస్ , మారముల్ల సదయ్య, రాచపల్లి రమేష్, గరిగ చంద్రయ్య, సెక్టార్ కమిటీ, బూత్ కమిటీ నాయకులు, బహుజన నాయకులు మేధావులు సుమారు 150 మంది పాల్గొన్నారు.



## నారాయణపూర్ గ్రామ ముంపు ఇళ్లు, ఇంటి స్థలాలను పరిశీలించిన ఆడిషనల్ కలెక్టర్

గంగాధర, జూన్ 08(వాయిస్ టుడే): నారాయణపూర్ గ్రామస్తులు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నారాయణ పూర్ గ్రామాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరుతూ ఇచ్చిన విజ్ఞాపన మేరకు జిల్లా కలెక్టర్ ఆదేశాముల మేరకు నారాయణ పూర్ గ్రామములో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి సంబంధిత నీటి పారుదల శాఖా అధికారులు మరియు భూసేకరణ అధికారులతో కలసి రిజర్వాయర్ కట్ట ఎత్తు పెంపులో భాగంగా ముంపునకు గురి అవుతున్న ఇండ్లు మరియు ఇంటి స్థలాలను పరిశీలన చేసి గ్రామస్తులతో చర్చించారు.నారాయణ పూర్ రిజర్వాయర్ లో నీటితో నింపడం వలన గ్రామము మొత్తం దుర్వసన, నీటి జాలు,కీటకాదులతో మరి ముఖ్యంగా వర్షాకాలములో తీవ్ర ఇబ్బందులకు గురివుతున్నామని అందువలన గ్రామం మొత్తాన్ని ముంపు గ్రామంగా ప్రకటించి సహాయం చేయాలని కోరుకుంటున్నాము అని తెలియజేయగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ తో చర్చించి నివేదిక ప్రభుత్వానికి సమర్పించి తగిన పరిస్కారం దిశగా చర్యలు చేపడుతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో భూసేకరణ ప్రత్యేక కలెక్టర్ నల్ల వెంకట్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు ఈఈ,డిఈఈ,గ్రామ సర్పంచ్ దీకొండ బాబ లక్ష్మి మధు,తహసీల్దార్ రజిత, ఎంపివో వంశీకృష్ణ,సర్వేయర్ రాకేష్, రజనీకాంత్,పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్,దామోదర్ రెడ్డి,వార్డు సభ్యులు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అటవీ శాఖ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత

కరీంనగర్, జూన్ 08(వాయిస్ టుడే): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో అటవీశాఖ కార్యాలయం కాంప్లెక్స్ నందు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు.ఈ కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి ఎస్ సత్యనారాయణ,అటవీ క్షేత్రాధికారులు ఎస్.కె షౌకత్ హుస్సేన్,మాధవి శీతల్,జి శ్రీనివాస్, ఉప అటవీ క్షేత్రాధికారి కరీంనగర్ మరియు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎన్ లావణ్య,అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## రూ. 32 లక్షలతో కపిలేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్ పనుల ప్రారంభం



కరీంనగర్, జూన్ 08(వాయిస్ టుడే): నగరంలోని 42వ డివిజన్‌లో గల చారిత్రక కపిలేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో భక్తుల మరియు స్థానికుల సౌకర్యార్థం రూ.32.00 లక్షల వ్యయంతో నూతనంగా చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, కరీంనగర్ నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ మరియు మాజీ మేయర్ యాదగిరి సునీల్ రావు పనులను ప్రారంభించారు.ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో యాదగిరి సునీల్ రావు,మాజీ కార్పొరేటర్ చంద్రమౌళి ఆలయ కమిటీ సభ్యులు కేశవరెడ్డి, కనకయ్య, శంకరయ్య,ఆలయ ప్రధాన అర్చకులు,స్థానిక నాయకులు,భక్తులు పాల్గొన్నారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్, జూన్ 08(వాయిస్ టుడే): నగరపాలక సంస్థ పరిధిలోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయడం,ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం లక్ష్యంగా సభను నిర్వహించారు.ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి,ఇందిరమ్మ ఇళ్లు,ఆసరా పెన్షన్లు,రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత పథకాలు తదితర సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు, వినతులు మరియు సమస్యలను అధికారులు ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్న మేయర్,ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు.తాగునీరు,పారిశుద్ధ్యం, వీధి దీపాలు,సీసీ రోడ్లు,డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.ప్రజలు తమ సమస్యలను, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గత పాలకులు అర్హులైన లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని పేర్కొన్నారు.ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కార్పొరేటర్లు,నగరపాలక సంస్థ అధికారులు,వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు,నాయకులు పాల్గొన్నారు.

## సేంద్రియ పద్ధతి విధానంపై రైతులకు అవగాహన కల్పించాలి

### బిజెపి కిషన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి అధికారులకు సూచన




మాడుగుల పల్లి జూన్ 8 వాయిస్ టుడే ) మండల కేంద్రంలోని బిజెపి కార్యాలయంలో మండల అధ్యక్షులు ఇతికాల జాన్ రెడ్డి ఆధ్వర్యంలో మండల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి జాతీయ కిసాన్ మోర్చా నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి చేయడం జరిగింది ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు సరైన సమయంలో ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉండేలా వ్యవసాయ సంబంధిత అధికారులు చొరవ తీసుకోవాలని అదేవిధంగా రైతులకు సేంద్రియ పద్ధతి ద్వారా ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని రసాయనిక ఎరువులను తగ్గించాలని సేంద్రియ ఎరువులు వాడాలని ఇట్టి విషయంపై రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు అదేవిధంగా నకిలీ విత్తనాలను అరికట్టాలని ఎవరైనా రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలను విక్రయించినచో వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరడం జరిగింది ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు గడ్డం వెంకట్ రెడ్డి జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న జిల్లా నాయకులు చిలుముల శ్రీనివాస్ రెడ్డి మండల సోషల్ మీడియా కన్వీనర్ దారమళ్ళ నాగరాజు మండల నాయకులు దాసరి యాదగిరి రామలింగయ్య వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ యువజన కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బిక్షపతి నియామకం



నర్సాపూర్ (వాయిస్ టుడే) : నర్సాపూర్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా హత్నూర మండలం మధుర గ్రామానికి చెందిన కుమ్మరి బిక్షపతి నియమితులయ్యారు ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు శివ చరణ్ రెడ్డి అదేవిధంగా నర్సాపూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి గారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతను అప్పగించినందుకు పార్టీని మరింత అభివృద్ధి చేస్తానని నర్సాపూర్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి బిక్షపతి తెలిపారు.



## అన్నదాత ఆత్మగానం

కష్టాల కడలిలో కరిగే రైతన్న..!
కన్నీటి కాలువలో కలిసే రైతన్న..!
కొనుగోలు కేంద్రాల్లో కాచే నిరీక్షణ..!
కడగండ్ల వానలకు చెదిరే
ఆకాంక్షణ..!
రైతే రాజు అన్నారు రైతన్నా..!
గిట్టుబాటు ధరను నిర్ణయించలేని
స్థితిలో నీవెన్నన్నా..!
పచ్చని పొలాల వెనుక నీ త్యాగ
గాథను ఎవరు గమనించారు..?
ప్రతి గింజలో దాగిన నీ జీవన
వ్యథను ఎవరు విన్నారు..?
దేశానికి వెన్నెముకవైన రైతన్నా..!
నీ చిరునవ్వు పూసే ఆ రోజుకై
ఎదురుచూస్తున్న కాలమన్నా ..!

రచన: మంజుల పత్తిపాటి
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్
కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218



## పెద్ది భాస్కర్‌రెడ్డిని పరామర్శించిన ఝరాసంగం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హనుమంతరావు పాటిల్

ఝరాసంగం జూన్ 08(వాయిస్ టుడే): ఝరాసంగం మండలంలోని బొప్పనపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ది భాస్కర్ రెడ్డి గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఝరాసంగం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హనుమంతరావు పాటిల్. ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. భాస్కర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న హనుమంతరావు పాటిల్, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు సంగ్రామ్ పటేల్, వేణుగోపాల్ రెడ్డి, దప్పూర్ సంగమేశ్వర్, డాకూరు శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సభను విజయవంతం చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



కరీంనగర్,జూన్ 08(వాయిస్ టుడే):సికింద్రాబాద్ పెరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా స్వశక్తి మహిళా సంఘాలకు 553 బస్సులను సీఎం రేవంత్ రెడ్డి పంపిణీ చేయనున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కరీంనగర్ జిల్లాకు కేటాయించిన 16 బస్సులను మహిళా సంఘాలకు సీఎం అందించనున్నట్లు తెలిపారు. ప్రతి మండల సమాఖ్య నుంచి 50 మంది స్వశక్తి మహిళా సంఘ సభ్యులు సభకు హాజరయ్యేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళల ప్రయాణం, భోజనం,ఇతర సౌకర్యాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తనాజీ వాకడే,శ్రీనివాస్ రెడ్డి, డీఆర్‌డీఓగీత,అదనపు డీఆర్‌డీఓ రవికుమార్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి శ్రీరామ్,ఆర్టీసీ డిపో మేనేజర్, అధికారులు పాల్గొన్నారు.

Printed by Published by : **Kotha Laxman** on behalf of Kotha Laxman, printed at and published at 10-5-336/2-1, Kishan Nagar, **Editor: Kotha Laxman.**